## పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మ, యా-యాజ్‌దాన్, లా ఇలాహ్**
**ఇల్లిల్లాహ్, ఓ గాడ్, ఫాదర్ ఇన్ హెవెన్.**

పరమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము,
అపవిత్రమును అగు
మా ప్రతి మాటకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకు
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకు,
సమస్త కపటవర్తనమునకు,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకు,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చిన
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసిన
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాప పడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నింటికిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని
మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలలమగుచున్న
మమ్ములను క్షమింప వేడుకొనుచున్నాము.

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.
**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310 Postal Concession: R&D/
RNP/789/2006-08, Dt.25-8-2006

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్ బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :7 సంచిక: 3 హైదరాబాద్ జూన్ 2008 పేజీలు: 40

వార్షిక సభ్యత్వం : రూ. 100/-



# మెహెరస్థాన్‌లో మౌనదినం ఏర్పాట్లు

అవతారుని 83వ మౌన వార్షికోత్సవ సందర్భంగా మెహెరస్థాన్, కొవ్వూరులో జూలై 10న బాబా ప్రేమికుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు కార్యదర్శి శ్రీ వై.ఎస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు.

మెహెరస్థాన్‌లో మౌనదినం పాటించాలని భావించే వారందరికీ వీలుగా జూలై 9 రాత్రి నుండి 11వ తేదీ ఉదయం ఫలహారం వరకు భోజన, వసతి, ఏర్పాట్లు చేశామని శ్రీ రావు తెలిపారు. ఇందుకు విరాళం రూపేణా ఒక్కొక్కరికి, నూరు రూపాయలు చెల్లించాలని ఆయన అన్నారు.

జూలై 10 మౌన దినం సందర్భంగా ఇటీవల బాబా ప్రేమికులు అధికశాతం - బాబా సమాధిచెంతకు మెహెరాబాద్‌కు వెళ్తున్నారు.

అక్కడదాకా వెళ్ళడం వీలుపడని వారికి అందరికీ సమీపంలో వున్న మెహెరస్థాన్ చక్కని అవతారుని ఆధ్యాత్మిక కేంద్రం అని ఆయనన్నారు.

## స్పెషల్ బహుమతి

1. మెహెర్‌బాబా మాసపత్రికకు వార్షిక/జీవిత సభ్యులను చేర్పించమని 2007 డిశంబరు నుండి మనవి చేస్తున్న విషయం పాఠకులకు విదితమే.
2. ఈ విషయంలో పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారందరికీ పత్రిక పక్షాన అభినందనలు- జై మెహెర్‌బాబా.
3. అత్యధిక సంఖ్యలో జీవిత/వార్షిక సభ్యత్వాలు పంపిన వారిలో ప్రముఖంగా 1)ఐ.వి.సన్యాసిరాజు, విశాఖపట్నం, 2) పి.ఎస్.కె.శర్మ, హైదరాబాద్, 3) బి.క్రిష్ణయ్య, సికింద్రాబాద్ ఉన్నారు.

న్యాయనిర్ణేతల తుది నిర్ణయం మేరకు పైన పేర్కొన్న ముగ్గురికీ అత్యంత సేవాభావంతో కృషిచేసినందుకు కృతజ్ఞతలుగా నాల్గు వాల్యూంలుగా గల, గత మే 2001 - జూన్ 2008 వరకు గల పత్రిక ప్రతులను ప్రేమ కానుకగా జూలై 10న మెహెరాబాద్‌లో అందజేయాలని నిర్ణయించడమైంది!!

దయచేసి స్వీకరించగలరు!! RSVP: Mobile: 9959553218



మెహెర్‌బాబా జూన్ 2008

## మెహెర్ సందేశం

"మెచ్చుకోలుతో ఉబ్బిపోకండి. విమర్శలకి కృంగిపోకండి. మీకు అప్పగించిన పనిని మనసా వాచా చేయండి. బాబా అప్పగించిన పనిని సక్రమంగా నిర్వహించామని అంతరాత్మ మీకు చెప్పాలి. అంతరాత్మనిమించిన జడ్జి మరొకరు లేరు. పొరపాటు చేయడం మానవనైజం. తప్పులు దొర్లుతాయి. బెంబేలు పడకూడదు. మీరు మీ శక్తి మేరకి పని చేస్తారు. ఎప్పుడూ టైమ్ ప్రకారం వెళ్ళండి. మీరు చేయాల్సిన పనిని ఇంకొకళ్ళకి అప్పగించకండి. మీ పనిని మీరే చేయండి. ఒకవేళ మీరు తప్పు చేస్తే నేను పట్టించుకోను. క్షమించి వదిలేస్తాను. నేను గట్టిగా దండిస్తే? దండిస్తే దండిస్తాను. అది మనస్సులో పెట్టుకొని కృంగిపోకండి". -మెహెర్‌బాబా

### మనవి

మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. మీకు 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.

గౌరవ సంపాదకులు
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**040-27860079**

వ్యవస్థాపకులు:
**దశిక ప్రసాదరావు**
040-65699611
040-64542370

## లోపలి పేజీలలో...

1. సంపాదకీయం 5
2. అవతారుని ఇచ్ఛ 6-15
3. లార్డ్ మెహెర్ 16-26
4. తోట పద్మనాభం 27-28
5. గొప్ప దుర్ఘటన 29
6. బాటసారులు 30-31
7. చంద్రమౌళీశ్వరావు 34-35
8. నిన్ను మరచి ఉండలేనయా 36
9. శ్రద్ధాంజలి 37
10. జీవిత సభ్యత్వం 38

# గుంటూరు సెంటర్‌లో

అవతార్ మెహెర్‌బాబా గుంటూరు సెంటర్ భవన నిర్మాణం 1970 ప్రాంతంలోనే చేపట్టారు. ఇక్కడ ఆరడుగుల నిలువెత్తు అవతారుని విగ్రహం సెంటర్‌కు విచ్చేసే ప్రేమికులకు స్వాగతం పలుకుతున్నట్లు ఉంటుంది. అయితే, బాబా విగ్రహానికి ఎదురుగా సుమారు 70 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పు గల విశాలమైన ప్రార్థనా హాలు ఉంది. ఈ హాలు చాలాకాలంగా రిపేర్లతో, ముఖ్యంగా వానాకాలంలో మరింత ఇబ్బంది పెడ్తోంది. హాలు పైకప్పు పెచ్చులు వూడి క్రింద పడటం పలుమార్లు జరిగింది. రాబోయే రోజుల్లో మరింత హాని జరగకుండా చూసేందుకై స్థానిక సివిల్ ఇంజినీర్ల సూచనల మేరకు ప్రార్థనా హాలు పైకప్పును తగిన రిపేర్ల నిమిత్తం పూర్తిగా తొలగించి పునః నిర్మాణానికి తగిన ఏర్పాట్లు చేయడమైంది. కాగా, ఇందుకు గాను సుమారు రు.15 లక్షలు వ్యయం కాగలదని అంచనా. ఈ విషయమై బాబా ప్రేమికులందరూ తగిన విధంగా సహకరించాలని సెంటర్ గౌరవ అధ్యక్షులు శ్రీ బి. రామక్రిష్ణయ్య ఒక ప్రకటనలో కోరారు.

విరాళాలు పంపగోరు వారు అవతార్ మెహెర్‌బాబా సెంటర్, గుంటూరు పేరున బ్యాంకు డ్రాఫ్ట్ ఈ క్రింది అడ్రస్‌కు పంపాలని ఆయన కోరారు.

K. Kankaiah Plot No:18, Meher Manzil, Seetharam Nagar,

NGO'S Colony, Pattabhipuram, **GUNTUR - 522706,**

**Mobile: 9885787719**

# మెహెరస్థాన్ ధర్మశాల వార్షికోత్సవం

మెహెరస్థాన్ ధర్మశాల వార్షికోత్సవం జూలై 27, ఆదివారం ఉ॥ 7.30 నుండి నగర సంకీర్తనతో ఘనంగా జరుపనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు శ్రీ వై.ఎస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెహెరాబాద్, పూనే సెంటర్లనుండి శ్రీమతి & శ్రీ జాల్. పి. దస్తూర్, శ్రీధర్ కేల్కర్, ఎల్.బి.థాడే, ప్రతాప్ ఆహిర్, లతో పాటు అవతారునితో అత్యంత సన్నిహితంగా మెలిగిన శ్రీ కె.కె.శ్రీవాత్సవ, లక్నో, తదితరులు పాల్గొంటున్నట్లు శ్రీ రావు తెలిపారు. సి.వై. చింతామణి (విజయనగరం), డి. శ్రీనివాస రావు (శ్రీకాకుళం) లచే భజన గీతాల ఆలాపన ఉంటుందని, శ్రీ బి. రామక్రిష్ణయ్య కార్యక్రమ నిర్వాహకులుగా వ్యవహరిస్తారని ఆయన అన్నారు.





సంపాదకీయం

# జూలై 10

2008 జూలై 10, గురువారం బాబా ప్రేమికులందరికీ ఎంతో పవిత్ర దినం.

ఆ రోజున బాబా భక్తులందరూ, ఇంటిల్లిపాదీ ఎంతో భక్తిప్రపత్తులతో మౌనంగా వుంటారు. మౌనంగా మెహెర్‌నామం జపిస్తారు.

మెహెర్‌బాబా 1925 జూలై 10 నుండి ఆయన భౌతిక దేహత్యాగం (1969 జనవరి 31) చేసేవరకూ కఠిన మౌనంలోనే వున్నారు. మౌనంగానే 13 సార్లు పలు విదేశాలలో పర్యటించారు. ఆశేతు హిమాచలం ఆయన పలుమార్లు అనేక ప్రదేశాలు సందర్శించారు. మౌనంగానే అనేక సందేశాలు – ప్రవచనాలు మెహెర్‌బాబా తన భక్తులకిచ్చారు.

"Discourses" by Meher Baba,

"God Speaks" – భగవద్వచనం" వంటి గ్రంథాలు ఆయన మౌనంలోనే రాశారు.

Things that are real, are given and received in Silence

Desire for nothing, except desirelessness

అని మెహెర్‌బాబా ఒక సందేశంలో అన్నారు.

నేను మీ అవసరాలకు (Needs) ఆదుకుంటాను. మీ కోరికలకు మాత్రం కాదని స్పష్టం చేశారు.

మెహెర్‌బాబా వాణి ఆయన ప్రేమికుల హృదయాలకు నేరుగా నిత్యం తాకుతూనే వున్నాయి. తమతో నిత్యం ఒక సహచరుడిలా మాట్లాడుతూనే వున్నాడని– ఆయన్ని గాఢంగా నమ్మి – ప్రేమించేవాళ్ళ నిశ్చితాభిప్రాయం!!

I am the way, I am the goal

I am God in human form

I have come not to Teach but to awaken అని బాబా స్పష్టం చేశారు..

మెహెర్‌బాబా ఈ యుగావతారుడు– మౌనావతారుడు.

2008 జూలై 10న మెహెర్‌బాబా మౌనం చేపట్టి 83 సంవత్సరాలు పూర్తవుతుంది.

అవతారుని 83వ మౌన వార్షికోత్సవం నాడు మనందరం భగవధ్యానంలో మౌనంగా వుందాం.

# స్వర్ణోత్సవ వేడుకలు

## "My wish", 'అవతారుని ఇచ్ఛ'

-సంచారి



శ్రీ గోపి బృందం వారిచే నమో మెహెరుబాబా ప్రార్థన

**'మే'** నెల మండుటెండల్లో చల్లని గాలులు వీస్తుంటే ఎలాగుంటుంది?

ఆదివారం- సెలవ రోజు, సాయంత్రం హాయిగా వుండాలని ఎందరికుండదు!!

2008 మే 25 ఆదివారం సాయంత్రం ఐదు గంటల నుండి ఎనిమిది గంటల దాకా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మెహెర్ ప్రేమికులందరికీ ఒక చక్కని వీనులవిందైన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బాబా ప్రేమికులందరూ హాయిగా ఆ కార్యక్రమాన్ని ఆసాంతం ఆస్వాదించారు.

"My wish", **'అవతారుని ఇచ్ఛ'** స్వర్ణోత్సవ వేడుకలవి.

అవతార్ మెహెర్‌బాబా తన ప్రేమికులు- భక్తులను ఉద్దేశించి 1958 మే నెలలో అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో గల మెర్టిల్ బీచ్ ప్రాంతంలో "My wish" అని తన ప్రేమికులు 'తన ఇచ్ఛ' ప్రకారం ఎలా నడుచుకోవాలో పేర్కొంటూ ఒక సందేశం ఇచ్చారు.

మెహెర్‌బాబాని భగవంతునిగా ఆరాదించే వారందరికీ ఆయన సందేశం "My wish" లోని అంశాలు అన్నీ బాగా తెలుసు. వారు ఆ అంశాలను ఏమేరకు ఆచరణలో అమలు చేస్తారన్నది మాత్రం వ్యక్తిగతం!!





### మెహెర్‌బాబా "నా ఇచ్ఛ"లో పేర్కొన్న ఆ ఆరు అంశాలు ఇలా ఉన్నాయి.

**1. Do not shirk your responsibilities.**

నీ బాధ్యతల నుండి మీరు తప్పించు కోవద్దు.

**2. Attend faithfully to your worldly duties, but keep always at the back of your mind that all this is Baba's.**

మీ ప్రాపంచిక విధులన్నింటినీ సక్రమంగా నిర్వహించండి. ఐతే, ఇదంతా బాబా దయవల్లనేనని మీ మనస్సులో ఎల్లవేళలా గుర్తుంచుకోండి.

**3. When you feel happy, think: "Baba wants me to be happy." When you suffer, think: "Baba wants me to suffer."**

మీకు సంతోషం కల్గితే బాబా దయవల్లనేనని భావించండి. అలాగే, దుఃఖం, బాధ అనుభవించాల్సివస్తే కూడా, అంతా బాబా దయవల్లనే అని భావించండి.

**4. Be resigned to every situation and think honestly and sincerely: "Baba has placed me in this situation."**

అన్నీ అవతారునికే వదిలి, బాబా నన్నిలా ఈ స్థితిలో వుంచాడని మనసార భావించండి.

**5. With the understanding that Baba is in everyone, try to help and serve others.**

ప్రతి ఒక్కనిలో బాబా ఉన్నాడని భావిస్తూ- చాతనైనంత సహాయ-సహకారాలు అందరికీ అందజేయండి.

**6. I say with my Divine Authority to each and all that whosoever takes my name at the time of breathing his last comes to me; so do not forget to remember me in your last moments. Unless you start remembering me from now on, it will be difficult to remember me when your end approaches. You should start practising from now on. Even if you take my name only once every day, you will not forget to remember me in your dying moments.**

మీ అవసాన స్థితిలో నా పేరు తలుచుకోవడం ద్వారా మీరు నన్ను చేరతారని నా దివ్యాధికారంతో చెప్తున్నాను. ఆఖరిక్షణాల్లో నా నామం తలచడం మరువకండి. మీరు నా నామస్మరణ చేసే అలవాటు నేటినుండీ అలవరచుకోకపోతే మీ తుది ఘడియల్లో నా నామం గుర్తుంచుకోవడం ఎంతో కష్టం.




సోరబ్ & రుస్తుంలు

1958 మే 24 మెహెర్‌బాబా మెర్టిల్ బీచ్‌లో "My wish" ప్రవచనం అందజేసి 2008 మే 25 నాటికి 50 సంవత్సరాలు నిండాయి. ఆధ్యాత్మిక పథంలో వున్న ప్రతి ఒక్కరూ ప్రభోదాత్మకమైన ఈ మెహెర్ సందేశాన్ని, తమ జీవిత కాలంలో తప్పక ఆచరించేందుకు ప్రయత్నించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

అంతటి మహత్తర సందేశాల్ని, అవతారుడి ప్రవచనాలను తిరిగి ఒకసారి గుర్తుచేస్తుకోవడానికన్నట్లు- హైదరాబాద్‌లోని జూబ్లి సెంటర్ నిర్వాహకులు శ్రీయుతులు బి.రామకృష్ణయ్య, పి.రాజేంద్రమెహెర్, వి.బాలాజీ ప్రభృదులు "My wish" సర్ణోత్సవ వేడుకలు హైదరాబాద్‌లో మే 25న ఘనంగా జరుపుకునేలా తగిన ఏర్పాట్లు చేసారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులు, ప్రధాన వక్తలుగా డా॥ జి.యస్.యన్. మూర్తి, సోరబ్& రుస్తుం (పూనే) సోదర ద్వయం పాల్గొన్నారు. డా॥ మూర్తి గారి ప్రధాన ప్రసంగం, సోరబ్-రుస్తుంల **మాట -పాటలతో** ఈ స్వర్ణోత్సవ సంబరాలు కడు రమ్యంగా జరిగాయి.

## సోరబ్ & రుస్తుం :

సోరబ్, రుస్తుంలు గురించి క్లుప్తంగా చెప్పాలంటే - వీరిద్దరూ కవల పిల్లలు.

మెహెర్‌బాబా సోదరుడు బెహ్రాం కుమారులు.

మెహెర్‌బాబా తల్లి షిరీన్ మాయి- తండ్రి షెరియార్.

పెళ్ళీడు వచ్చింది- పెళ్ళి చేసుకోవాలని వృద్ధాప్యంలో మేం సంతోషంగా గడపాలంటే





నీవు తప్పక వివాహం చేసుకోవాలని తల్లి-షిరీన్‌మాయి- మెహెర్‌బాబాని తరచు సతాయిస్తుండేది.

ఒక సందర్భంలో - సోదరుడు బెహ్రాం ఎదురుగా వున్నప్పుడు మెహెర్‌బాబాతో తల్లి షిరీన్ ఆయన పెళ్ళి ప్రస్తావన తీవ్ర స్థాయిలో జరిగింది.

వెంటనే బాబా ఎదురుగావున్న సోదరుడు బెహ్రాం నుద్దేశించి- నువ్వు నా మాట కాదనక - తల్లి మాటను నెరవేర్చమని ఆదేశించారు.

బెహ్రాం హతాశుడయ్యాడు.

తల్లి కోర్కె తీర్చేందుకై నీవు పెళ్ళికి ఒప్పుకోవాలని బాబా బెహ్రాం చేత ఒప్పించారు.

బెహ్రాంకు నాసిక్ నివాసిని పర్వీన్‌తో వివాహం జరిపించారు.

బెహ్రాం-పర్వీన్‌లకు ద్వితీయ సంతానంగా కల్గిన కవల పిల్లలే రుస్తుం-సోరబ్‌లు. యిద్దరూ ఒకేలాగే వున్నారు.

కేశఖండన చేయించుకుని, పెద్ద వెండి చెంబుల్లాగా ధగధగ లాడుతున్న పెద్ద సైజుగుండు తలకాయలతో, భారీ దేహధారుద్యంతో, చక్కని ధవళకాంతులీనుతున్న ముఖ వర్చస్సుతో హాస్య-చతురత- సంభాషణా చాతుర్యం కలబోసి, దేవుని కుటుంబీకులుగా వీరు కనిపించారు.

వీరిద్దరి తర్వాత సోదరి గుల్మార్ జన్మించింది.

ప్రస్తుతం తల్లి పర్వీన్(90), గుల్మార్, ఈ అన్నదమ్ములిద్ధరూ అందరూ పూనేలోని బాబా ఇంట్లోనే వుంటున్నారు.

విడివిడిగా చూసేవారికి, క్రొత్తవారికీ- ఎవరు రుస్తుమో, ఎవరు సోరబ్బో పోల్చుకోవడం క్షణకాలం కష్టమంటారు. ఈ విషయంలో సృష్టికర్తైన మెహెర్‌బాబానే ఇబ్బంది పడుతున్నానేవారు.

విశ్వకార్యక్రమ భారంతో తలములకై వుండే అవతారునికి హాస్యం అందించి, ఆయన్ని నవ్వులతో ముంచెత్తడం - మండలి సభ్యుల ప్రధాన కర్తవ్యంగా వుండేది. మేం కూడా ఆ పనిలో, మా చేతనయిన సహాయం చేస్తుండే వాళ్ళమని వినయంగా ఈ సోదర ద్వయం ముందుగా తమ గురించి ఆహుతులకు పరిచయం చేసుకున్నారు.

బాబాని సంతోష పెట్టాలన్నది మా ఆశయంగా ఉండేది. ఆయన్ని సంతోషపెట్టడమంటే ఆయన ఇచ్చును తు.చ. తప్పక పాటించడమే అన్నారు.

మెహెర్‌బాబా హాస్యప్రియుడు. ఆయన మౌనంతోనే సున్నిత హాస్య చతురత ప్రదర్శించేవారు. బాబాని సంతోషపెట్టడం కోసం మేం చిన్న నాటకాలు వేసేవాళ్ళం. పాటలు పాడేవాళ్ళం.

జోక్స్‌- కథలు- చెప్తుండేవారం.

ఆయన్ని నవ్విస్తుంటే, ఆయన విశ్వ ఆధ్యాత్మిక భారాన్ని తగ్గించడంలో కొంత ఊరట కల్గించామని భావించే వాళ్ళం.

అలా అంటూ- మెహెర్‌బాబా **'సోదరి-మణి"**, రాసిన ఒక పాట,

**మెహెర్‌బాబా- మేహెర్‌బాబా,**

**జై జై బోలో మేహెర్‌బాబా**

అని చక్కని పాట- రాగతాళ యుక్తంగా ఆలాపించారు. సభికులందరూ కూడా కోరస్‌గా - వారితో తమ గొంతులు కలిపారు.

రుస్తుం- సోరబ్‌లది చక్కని వర్చస్సు- పర్సనాలిటీతో పాటు చక్కని గళం- గాత్ర మాధుర్యం ఉంది. మాటల్లో సహజ చతురత- ఎదుటివారిని కట్టిపడేసే ఆకర్షణ వుంది!!

పూనేలోని గురుప్రసాద్‌లో మెహెర్‌బాబా వేసవి కాలంలో వుండేవారు. 1958-1968 మధ్యకాలంలో వేసవి విడిదిగా మెహెర్‌బాబా గురుప్రసాద్‌లో వుండేవారు. ఈ సమయంలో ప్రతిరోజూ బాబా మండలి ప్రేమికులు - రోజుకు ఒకరు చొప్పున ఏదేని హాస్యమిళితమైన కథ లేదా ఒక జోక్‌ చెప్తుండేవాళ్ళం.

ఇదంతా ఆయన నిమగ్నమైవున్న ఆధ్యాత్మిక కార్యక్రమం నుంచి కొంత ఉపశమనం కల్గించడానికేనని వారు తెలిపారు.

కాగా, ఒక రోజున మావంతు వచ్చింది!! ఆ రోజున బాబాకు ఒక చిన్ని కథ చెప్పాం, అని సోరబ్‌ రుస్తుంలు ఇలా అన్నారు. మేమిద్దరం ముందుగా సేకరించిన ఒక కథ బాబాకి వినిపించాం. బాబా చాలా సంతోషించారు. చాలా బాగా ఆనందించారాయన. ఆ కథని తిరిగి మీ అందరికోసం చెప్తామని వారిలా చెప్పసాగారు.

లండన్‌ మహానగరంలో, 90 అంతస్తుల ఎంపైర్‌ హొటలు గురించి చాలా మందికి తెలుసు. ముగ్గురు స్నేహితులు ఆ హొటలులోని 90వ అంతస్తులో బస చేసారు. నగరంలో వ్యాహ్యాళికి వెళ్ళి, రాత్రి బాగా పొద్దుబోయాక తిరిగి తమ హొటలుకు వచ్చారు. సరిగ్గా ఆ సమయంలో హొటలులో కరెంటు పోయి లిఫ్ట్‌ పన్జేయదు. పోయిన కరెంటు ఎప్పుడొస్తుందో కూడా చెప్పలేని పరిస్థితి. దాంతో తమ కాళ్ళకు బుద్ధిచెప్పాలని ఆ ముగ్గురు స్నేహితులు నిర్ణయించారు. 90 అంతస్తులు ఎక్కడమంటే మాటలా!!

ఆ ముగ్గురు ఫ్రెండ్స్‌లో ఒకరు అమెరికన్‌ దేశీయుడు,

రెండవాడు - ఫ్రెంచి, మూడవవాడు భారతీయ సర్దార్‌జీ!!

తొంభై అంస్తులు మెట్లు ఎక్కడం సామాన్యమైన విషయమేమీకాదు. అందుకోసం మిత్రులందరూ కల్సి ఒక అభిప్రాయానికొచ్చారు. అదేమంటే ప్రతి 30 అంతస్థులకు





ఒకరు చొప్పున తమకు బాగా నచ్చిన కథ ఒకటి చెప్పాలని- అలా కథలతో కాలక్షేపం జేస్తూ సునాయాశంగా తొంభయ్యవ ఫ్లోర్‌లో వున్న తమ గదికి చేరుకోవాలనీ అనుకున్నారు.

కథ చెప్పడంలో ముందుగా అమెరికన్‌కి ప్రాధాన్యం ఇచ్చారు.

అమెరికన్‌ తన దేశయుద్ధ ప్రావీణ్యత గురించి అలుపెరగకుండా 30వ ఫ్లోర్‌ చేరేదాకా చెప్పుకొచ్చాడు. అక్కడ్నుంచి ఫ్రెంచి దేశీయుని వంతులో భాగంగా - తమదేశంలో ప్రశస్తమైన ప్రేమ-శృంగార విశేషాలతో కూడిన విషయాలపై కథలు కథలుగా చెప్తూ అరవై అంతస్తులు ఎక్కేసారు.

ఇక అక్కడ్నుంచి సర్దార్‌జీ వంతైది. ఐతే సర్దార్‌జీ నోరు మెదపడు. అదొక 'విచారగాథ' అంటూ ఒక్కొక్క మెట్టూ, కథ చెప్పకుండానే ఎక్కించేస్తాడు. ఎక్కడికక్కడ సర్దార్‌జీని ఉసిగొల్పుతూ ట్రాజెడీ కథ అయినా ఫరవాలేదు, మేం ఎంజాయ్‌ చేస్తాం, **ప్లీజ్‌** కథ మొదలుపెట్టమని ఎంత బలవంతం చేసినా సర్దార్‌జీ తన సహజ ధోరణిలో విచారవదనంతో నాకు చెప్పడం చాతకావడం లేదంటూ చివరాఖరుకు తొంభై అంతస్తులూ ఎక్కించేస్తాడు. 90వ ఫ్లోర్‌లో తమ గది రానే వచ్చింది. గదిలోపలికి వెళ్ళే ముందు నీవు చెప్పే ఆ విచార కథని విన్నాకనే లోనికి వెళ్దామని మిగిలిన ఇద్దరు స్నేహితులు పట్టు పడతారు. వద్దు, వద్దు నేను చెప్పేది వింటే మీరందరూ ఏడుస్తారు. అదొక గొప్ప ట్రాజెడీ అంటూ సర్దార్‌జీ కళ్ళనీళ్ళ పర్యంతంతో, మీకు చెప్పడానికి నా



నోరు పెగలట్లేదు. అంటూ గద్గద స్వరంతో మన రూం తాళాలు సెల్లార్‌లో కారు పార్కింగ్ చేసేటప్పుడు మరిచిపోయి కార్లోనే వదిలేశాను. మనం లోపలికి ఎలా వెళ్ళగలం?? అని ప్రశ్నార్థకంగా తన స్నేహితులకేసి చూసే సరికి వారిరువురు అవాక్కవుతారు!

హతవిధీ!!!

ఈ కథ ముగించేసరికి బాబా మౌనంగానే కడుపారా నవ్వడం మేం చూసి – మేం కూడా ఆనందించాం!! అంటూ తమ సహజ చతురతతో సభికుల్ని అందరినీ ఆనందపరిచారు రుస్తుం & సోరబ్‌లు. ఇలా పలు అంశాలు చెప్తూ మరో విశేషంగా వారు తమ ప్రసంగం కొనసాగించారు.

## గోళీలాట:

ఒక సందర్భంలో బాబా మా యింటికి వచ్చారు.

మాతో గోళీలాడదామన్నారు. ముందుగా తానే ఆడతానని క్రొత్త గోళీలన్నింటినీ తన ముందుకు తీసుకున్నారు. ఆ తర్వాత తన చూపుడు వ్రేలుతో తన బలాన్నంతా కూడదీసుకున్నట్లు గట్టిగా గురిచూసి గోళీలకేసి కొట్టడం ప్రారంభించారు. మధ్యలో రెండు గాజు గోళీలు ఫటాలున ముక్కలు చెక్కలుగా పగిలిపోయాయి. బాబా ముఖకవళికలు చూస్తుంటే ఆయనేదో తీవ్ర ఆందోళనలో వున్నట్లు కన్పించింది. కొద్దిసేపటి తర్వాత బాబా ఆట ముగించి – వెళ్దామని లేచారు. మేం కూడా ఆడతామనే సరికి **"గేమ్ ఖతమ్"** అని ముక్తసరిగా అని కారులో సతారా వైపు వెళ్ళారు.

ఆ మర్నాడు మాకు తెలిసింది. సతారాలో జరిగిన బాబా కారు ప్రమాదం, డా॥ నీలూ మరణం, ఇతరత్రా సమాచారం.

ఈ విషయాలు మా అమ్మ నేటికి చెప్తుంటుందని 1958 సతారా ఆక్సిడెంట్ ముందురోజు గురించి క్షణకాలం గుర్తు చేశారు.

## ససూన్ ఆసుపత్రి :

మేమిద్దరం బాబా జన్మించిన ససూన్ ఆసుపత్రిలోనే పుట్టాం. బాబానే స్వయంగా మాయిద్దరిలో ఒకరికి రుస్తుం అనీ మరొకరిని సోరబ్ అనీ పేరు పెట్టారు.

పసితనంలోని మాట ఇది. ఒక సందర్భంలో మాలో ఒకరు అంటే రుస్తుం తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. చాలా బక్క పలచనగా వున్నాడు. ఆరోగ్యం క్షీణించింది. ఈ సమయంలో బాబా మా ఇంటికి వచ్చి– మేమున్న గదిలోకి వచ్చారు. రుస్తుంని చూపిస్తూ వీడు బ్రతకడం కష్టం.

బాగా నీరసంగా వున్నాడు. సోరబ్– ఫరవాలేదు. వాడు బాగా బలంగా వున్నాడు. ఆరోగ్యంగానూ వున్నాడని– మా అమ్మతో చెప్పి– వెళ్ళబోతుంటారు బాబా. మా అమ్మ





కళ్ళలో నీళ్ళు చెమ్మగిల్లాయి.

మా అమ్మ– బాబాకేసి చూసి, బాబా, యిద్దరినీ నీవే ఇచ్చావ్. ఇందులో ఒకరిని తీసుకు పోవడం ఎందుకు– యిద్దరినీ తీసుకుపో– అని బాధగా అంటుంది.

బాబా బయటకు వెళ్ళిపోబోతూ– తిరిగి మా మంచం దగ్గరకి వచ్చి, జ్వరంతో బాధపడుతున్న రుస్తుంని తన భుజాన వేసుకుని, ఆ తర్వాత గాఢంగా తన హృదయానికి హత్తుకున్నారు. ఆ తర్వాత బాబా సతారావైపు వెళ్ళారు. అలా బాబా రుస్తుంకి తిరిగి ప్రాణం పోశారని నవ్వుతూ సోదరులిద్దరూ తమ గురించి చెప్పారు.

**"పత్తర్ పత్తర్ మే పాలిక్కా నామ్"**

ప్రతి రాయిపై బాబాపేరు రాయి, బాబానే కష్టాల నుంచి మిమ్మల్ని గట్టెక్కిస్తాడనే అర్థం ఉన్న పాటను– మెహెరామాయికి ఎంతో ఇష్టమని సోదరులిద్దరూ లయ బద్ధంగా ఆలాపించారు.

సోరబ్ డోలక్ వాయిస్తూ ఎంతో మధురంగా ఈ గీతం పాడాడు. సభికులు అందరూ ఆనందించారు.

**ఇద్దరూ కల్సివుండండి :**

మా పిన తండ్రి మెహెర్‌బాబా పూనే గురుప్రసాద్‌లో బస చేసిన రోజులవి. గురుప్రసాద్‌ను దాటుకుంటూ, అంకుల్‌ని దూరంనుంచే చూస్తూ, సైకిళ్ళపై స్కూల్‌కి వెళ్ళేవాళ్ళం. దూరం నుంచి బాబాకు చేతులు ఊపుతూ గురుప్రసాద్ దాటే వాళ్ళం. అలా వెళ్తూ ఒక రోజున సోదరులలో ఒకడైన రుస్తుం చాలా స్పీడ్‌గా సైకిల్‌పై వెళ్తున్నాడు. ఆతని వెనక సోరబ్ స్లోగా వెళ్తున్నాడు ఇది గమనించిన బాబా ఆ మర్నాడు అన్నదమ్ములిద్దర్నీ తన భవనానికి పిలిపించి ఈ రోజునుంచి మీరిద్దరూ కల్సినడవాలి– కల్సి వెళ్ళాలి. అలా ఒకరు ముందర మరొకరు వెనక్కాల ఉండరాదన్నారు. కలిసి మెలిసి ఉండాలని బాబా ఆదేశించారు. ఆనాటి నుంచీ బాబా ఆదేశాల ప్రకారం కల్సి మెలిసే వుంటున్నాం నేటిదాకా.

మధువు, మగువ, సిగరెట్లు కాల్చడం వంటివి తగదని బాబా ఆదేశించారని అన్నదమ్ములు గుర్తుచేసుకున్నారు.

**ఘనీ సిగరెట్లు :**

డా॥ ఘనీ బాబాకి చిన్ననాటి స్నేహితుడు. ఆదరిమలా బాబా మండలి సభ్యుడూనూ. ఆయన సిగరెట్లు– చాయ్– (టీ) అధికంగా సేవించేవాడు. ఇది గమనించిన మెహెర్‌బాబా డా॥ ఘనీని రోజుకి ఐదు సిగరెట్లు, మూడు కప్పుల టీ మాత్రం తీసుకోవాలని అంతకు మించరాదని ఆదేశించారు.

డా॥ ఘనీ– గొప్ప చతురుడు.

ఆయనేం చేశాడనుకున్నారు.

ఒక సిగరెట్‌కు- మరొకటి- దానికి మరొకటి- దానికి మరొకటి చొప్పున ఒక ఐదారు సిగరెట్లు ఒకదానితో నొకటిని జాయింట్ చేసి, ఒక మీటర్ పొడవున్న అతి పెద్ద సిగరెట్‌ను తయారుచేసి గుప్పు- గుప్పున పొగవదలడం మొదలెట్టాడు. ఇలా రోజుకి మూడు దఫాలకే పరిమితం చేశాడు.

అలాగే, బాబా టీ త్రాగడాన్ని నిషేదించారు కదా!!

ఒక పెద్ద జార్ నిండా టీ నింపుకుని త్రాగడం ప్రారంభించాడు.

ఇది తెలిసి బాబా- ఫక్కున నవ్వి - డా॥ ఘనీని మందలించి తన ఆదేశాల్ని తు.చ.తప్పక పాటించమని కోరారు.

## బాబా నామం:

ఇది కూడా పూనేలోని గురుప్రసాద్ సంఘటనే.

ఒక రోజున బాబా మమ్మల్ని పిలిచి నా నామం జపిస్తున్నారా? అని ప్రశ్నించారు.

ఓ! ప్రతిరోజు జపిస్తున్నాం బాబా అని జవాబిచ్చాం. రోజుకి ఉదయం- సాయంత్రం 101 మార్లు నా నామం జపించాలని ఆదేశించారు.

ఓ వారం రోజులు గడిచాక, బాబా తిరిగి, 'నామం' గురించి ప్రస్తావిస్తూ మేం ఎలా నామం జపిస్తున్నామో అని అడిగారు.

మేమిద్దరం- గుక్క తిప్పకుండా 101 సార్లు ఎలా- ఎంత స్పీడుగా నామం చేస్తున్నామో బాబా ఎదుట ప్రదర్శించాం. మనలో కూడా చాలా మంది అలాగే జపిస్తుంటారు.

కొంత మెకానికల్‌గా కూడా. సమయాభావం కదండీ!!

అందుకేనేమో అన్నట్లు, వాళ్ళద్దర్నీ తన దగ్గరగా పిల్చి,

**బాబా- బాబా- బాబా-** అని నెమ్మదిగా, హృదయం నుంచి ఆలాపించేలా, హృదయపు లోతు కవాటాలనుంచి పిలుస్తున్నట్లు- నింపాదిగా-కొంత వ్యవధి మేరలో - ఆగి-ఆగి, లయబద్ధంగా అవతారుని నామం పలకాలని- ఆ నామం అవతారునికి వినపడాలని, బాబా స్వయంగా తమకు సూచించారని రుస్తుం- సోరబ్‌లు చెప్పారు.

ఇది తమకు గొప్ప కనువిప్పు అని సభికులు అభిప్రాయపడ్డారు.

అలాగే ఒక దఫా స్త్రీ వేషం వేసుకుని మండలి సభ్యులందర్నీ ఆశ్చర్యపరిచినట్లు రుస్తుం సోరబ్‌లు తమ జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు.

ఆ తర్వాత బాబా స్వయంగా హూమాపేరుతో రాసిన ఘజల్ నొకదాన్ని కదురమ్యంగా ఆలాపించారు.





## నారియా

బాబా మహత్యాలు చేయరంటారు. కాని ఈ విషయాన్ని పరిశీలించండన్నారు.

బాబా దగ్గర **నారియా** అనే ప్రేమికుడు ఉండేవాడు. ఆతను సుమారు 4 సం॥ వయస్సులో పూనేలోని బాబా వుండే యింటికి వచ్చాడు. మాతో పాటే ఆడుతూ, పాడుతూ తిరిగాడు. ఇంతకీ చెప్పొచ్చేదేమంటే, చిన్నతనం నుంచీ ఆతనికి చెప్పనలవికాని **'నత్తి'** వుండేది. గబగబా మాట్లాడలేడు. **బాబా- బాబా** అనడానికి కూడా చాలా ప్రయాసపడేవాడు. బాబా గురుప్రసాద్‌లో వుండేరోజుల్లో 1968లో ఒకసారి ఆతడ్ని బాబా తన దగ్గరగా పిల్చి- **మెహెర్‌బాబా - మెహెర్‌బాబా-** అని గబగబా అనమని ఆదేశించారు. పాపం! నత్తి కారణంగా, చాలా బాధతో ఎంతో ఇబ్బంది పడ్డాడు. మేమందరం అది చూసి అయ్యో అనుకున్నాం!! మేం కూడా చాలా బాధపడ్డాం.

1969లో బాబా దేహత్యాగం చేశాక, సమాధిపై మోకరిల్లిన వారిలో నారియా కూడా సహజంగా వున్నాడు. మీరు నమ్ముతారో! లేదో? కానీ, ఆ వెనువెంటనే ఆతని మాట సక్రమమయింది. ఆతని మాటల తొందరలో నత్తినల్గిపోయింది. మా అందరికీ ఆశ్చర్యం కల్గించిందీ సంఘటన!

ఇలా అనేకానేక విషయాలు సోరబ్- రుస్తుంలు తమ భగవంతుని బంధువుతో గల సన్నిహిత సంబంధ బాంధవ్యాల గురించి, అవతారుని విశిష్టత గురించి అనర్గళంగా సుమారు 60 నిముషాలు ప్రసంగించి - పాటలు పాడి- బాబా ప్రేమికులందర్నీ ఆనందడోలికలలో ఓలలాడించారు.

ముందుగా కార్యక్రమాలను శ్రీ గోపి బృందం **నమో మెహెరుబాబా** ప్రార్థనా గీతంతో ప్రారంభించారు.

డా॥ జి.ఎస్.ఎన్.మూర్తి తన సహజ చాతుర్యంతో ఆంగ్లంలో అవతారునితో తనకుగల సాన్నిహిత్యాన్ని, అవతారుని ప్రేమతత్వాన్ని సోదాహరణంగా వివరించారు.

కొన్ని వేలమంది బాబా ప్రేమికులు రాష్ట్రం నలుమూలల నుండి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

సమశీతలం గల రవీంద్రభారతి ఆడిటోరియం ఫుల్ కెపాసిటి బాబా ప్రేమికులతో కిక్కిరిసింది. కార్యక్రమం ప్రారంభానికి ముప్పై నిమిషాలకి ముందరగానే ఆడిటోరియం పూర్తిగా నిండింది. సరిగ్గా సమయానికి వచ్చినవారు, కాస్త ఆలస్యంగా వచ్చినవారు ఆడిటోరియం పై అంతస్థుల్లో సర్దుకోవలసివచ్చింది. కార్యక్రమాన్ని సరిగ్గా సాయంత్రం ఐదు నుండి ఎనిమిది గంటల వరకు నిర్వహించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో కూడిన చక్కని మనోరంజకమైన, అరుదైన విశేష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన జూబ్లి సెంటర్ నిర్వాహకులను ప్రతి ఒక్కరూ ప్రశంశించారు.

# అవతార్ మెహెర్‌బాబా జీవిత చరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ,
లార్డ్ మెహెర్
వాల్యూం-3 (1925-29)

**మెహెర్‌ప్రభు - వాల్యూం-3**

***- తెలుగు సేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ***

ఆవేళ అంటే ఏప్రిల్ 3వ తేదిన చిన్చోర్కర్ (నగర్) ఇంటిలో బాబాకి కోపం వచ్చిన సంగతి పాఠకులకి గుర్తుందికదా! ఇంతకీ ఎందుకు వచ్చిందో కోపం. అందరూ అనుకొన్నారు కదా, చిన్చోర్కర్ చేసిన భోజనం ఏర్పాట్లు బాబాకి నచ్చలేదని. హరిజనులకొక పంక్తినా, మిగిలిన వారందర్నీ మరో పంక్తినా కూర్చోమన్నాడు. కాబట్టి బాబాకి కోపం వచ్చిందని అందరూ అనుకొన్నారు. బ్రాహ్మణులు, పార్శీలు, ఇతర అగ్రవర్ణాల వారుకూర్చున్న పంక్తిలో బాబాని కూర్చోమని బలవంతం పెట్టడంకూడా ఆయన చిరాకుకు కారణమయిందనుకొన్నారు. కొందరు బాబా ప్రతి చర్య వెనుక ఏదో ఒక కారణం వుంటుంది. ఆ వేళ కూడా అంతే. చిన్చోర్కర్ కష్టాల్లో వున్నాడు. డబ్బుల కోసం బాగా కటకటగా వుంది. దిగులుతో క్రుంగిపోతున్నాడు. బాబా వచ్చిన ఆనందం వో ప్రక్క, అయ్యో, దేవాది దేవునికి సరైన సపర్యలు చేయలేకపోతున్నానే, అన్న బాధ మరో ప్రక్క. వీటికి తోడు బాబా అక్షింతలు అతన్ని వుక్కిరి బిక్కిరి చేసేశాయి. డబ్బు చింత మరచి పోయాడు. బాబాకి ఏం కావాలో, బాబా కోసం ఏంచేయాలో, ఎలా చేయాలో అన్న ధ్యాసలో మునిగిపోయి ప్రభువుకి తన గోడు చెప్పుకోవాలన్న సంగతే మరచిపోయాడు.

బాబా మెహెరాబాద్ దారి పట్టిన కాసేపటికి, చిన్చోర్కర్ ఈ లోకంలోకి పడ్డాడు. అయ్యో! ఎంత పొరపాటు జరిగిపోయింది. నా మతిమరుపు పాడుకాను. నా గోడు చెప్పుకోలేక పోయాను. నేనెంత దురదృష్టవంతుడినో, అని మథన పడుతూ మెట్లపై కూర్చొన్నాడు.

ఇంతలో విష్ణు సైకిల్‌పై వచ్చి, బాబా ప్రసాదం ఇమ్మన్నారంటూ, వో కవరు చేతిలో పెట్టాడు. ఆత్రంగా కవరు అందుకొన్నాడు.

కవరు తీసి చూశాడు.





ఆశ్చర్యరతో అవాక్కయ్యాడు.

ఆ కవరులో ఏముందో తెలుసా?

రూపాయలకట్ట!

ఎంత దయామయుడో బాబా.

నన్ను గట్టెకిస్తున్నాడనుకున్నాడు. ఇంతలో అనుమానం వచ్చింది. బాబాకి ఎవరు చెప్పిండొచ్చూ?

నేనయితే చెప్పలేదు.

మా ఆవిడచెప్పే అవకాశం లేదు.

ఎందుకంటే డబ్బుల ఇబ్బంది గురించి ఇంటిలో నేను చెప్పలేదు కదా. నే చెప్పకపోతే, తనకి ఎలా తెలుస్తుంది. మరి నేనూ చెప్పక, మా ఆవిడ చెప్పక మరి ఎవరు చెప్పివుంటారు.

అనుమానంతో మెరుపు మెరిసినట్లు మరో భావన కలిగింది. ప్రభువు సర్వాంతర్యామి. దయామూర్తి. ఆయనకు ఒకళ్ళు చెప్పాల్సిన పనేముంది. సర్వం ఆయనకు తెలుసు. అసలు బాబాకి తెలియని సంగతి ఏమైనా వుంటుందేమిటి? ఇలా అనుకొంటూంటే, బాబాపై గురి మరింత పెరిగింది. బాబా సర్వాంతర్యామి అన్న నమ్మకం కుదిరింది.

ఇంతలో మరో ధర్మసందేహం చుట్టుముట్టుకొంది.

భగవంతుడినుంచి డబ్బు ఎలా తీసుకోవటం?

ఇదితప్పు కదూ! అనిపించింది.

ఆ మాటే విష్ణుతో అన్నాడు. ఐతే అతగాడు చిన్చోర్కర్ మాటల్ని పట్టించుకోలేదు. సరికదా, ఇదిగో చూడు. బాబా నీకు కవరు ఇచ్చి వెంటనే రమ్మన్నారు. నేను వచ్చిన పని అయిపోయింది. నేను వెళ్ళి పోవాలి అంటూ సైకిల్ ఎక్కి తుర్రు మన్నాడు.

చిన్చోర్కర్ అవాక్కయ్యాడు. భగవత్ప్రేమకి పాత్రుడనవుతానని కానీ, భగవత్ ప్రసాదంతో తన కష్టాలుగట్టెక్కుతాయని ఎప్పుడూ వూహించలేదేమో కాసేపు మనస్సు మొద్దుబారింది. ఆ తర్వాత ఆనందంతో గెంతులువేసింది.

మనకి ప్రపంచంలో అర్థం కాని సృష్టి విచిత్రాల్లో భగవత్ప్రేమ వొకటి. యావత్ సృష్టిలో అంతుబట్టని సంగతి ప్రేమ. కానీ, భగవత్ వర ప్రసాదం వుంటే, ప్రేమామృతం లభిస్తుంది. ఆ అమృతాన్ని ఒక్కసారి సేవిస్తే, జన్మధన్యమైనట్లే. దేవదేముడు తన భక్తుల్ని మరచిపోడు సరికదా, వాళ్ళ ఆలనా పాలనా చూస్తాడు. ఐతే, వచ్చిన చిక్కల్లా ఏమంటే భగవత్ప్రేమానుభూతిని పొందటం వో పట్టాన సాధ్యం కాదు. ఆ అదృష్టం భగవత్

సాన్నిధ్యంలోనే దొరుకుతుంది.

భగవత్ సన్నిధిలోనే ప్రేమ లోతు తెలిసివస్తుంది.

అదొక వరం.

అద్భుత వరం.

ఆ వరం మనకు ఇవ్వాలనే కదా దయామయుడైన ప్రభువు చాలా నిర్దయగా వ్యవహరిస్తాడు.

చిన్చోర్కర్ ఎంత అదృష్టవంతుడో!

ఏప్రిల్ 4వ తేదీ రంజాన్.

ఇది ముస్లిమ్‌ల పండగ.

నెలరోజులపాటు ఉదయంనుంచి సాయంత్రం వరకూ పచ్చి నీళ్లుకూడా తీసుకోకుండా దీక్షగా గడిపాక జరుపుకొనే పండగ రంజాన్.

ఆ వేళ మెహెరాబాద్‌లో పండగ వాతావరణం వెలిసింది. చుట్టుప్రక్కల గ్రామాలనుంచి ఎందరో వచ్చి, బాబా దర్శనం చేసుకొని తరించారు.

ఆ సాయంత్రం ఇద్దరు కవులు వచ్చారు. ఆశువుగా పద్యాలు చెప్పుకున్నారు. వాళ్ళు పోటాపోటీగా కవితలు అల్లుతుంటే, ఇది కవితల పోటీలాలేదు. బెండకాయల పోటీలా వుందని బాబా చమత్కరించారు. మాటల గారడీ, ప్రాసకోసం తాపత్రయం, కవిత్వం కాదని వ్యాఖ్యానించారు.

రంజాన్ పండుగ మర్నాడు హజరత్ బాబాజాన్ బాలికల పాఠశాల తెరిచారు. మారుతీ పటేల్ ఇంటి ఆవరణలో స్కూలు పెట్టారు. ఇతగాడు ఆరంగావ్‌లో వుంటున్న సంగతి పాఠకులకి తెలుసుకదా. గతంలో మెహెర్‌బాబాతో పెట్టిన మొదటి స్కూలులో పని చేసిన క్రైస్తవ మహిళ బోమ్మాన్జ కుటుంబం (మెహెరాబాద్)తో వుంటుంది. అమ్మా, నువ్వు, కొత్త స్కూలులో టీచరుగా పనిచేయి అన్నారు.

ఆమె "మహాద్భాగ్యం" అంది.

మధ్యాహ్నం బాబా స్కూలికి వచ్చారు. అక్కడి దృశ్యం కోపం తెప్పించింది. పిల్లలు మట్టికొట్టుకుపోయి కనిపించారు. స్కూలు ఏర్పాటులో ఎన్నో అవకతవకలు కనిపించాయి. ఛాన్జీ, ఢాకేలని పిలిచి, చివాట్లు పెట్టారు. మీరు శ్రద్ధగా పని చేయకపోతే, స్కూలు మూశేస్తాను. జాగ్రత్త! అని హెచ్చరించారు. అఫ్సరీ ఎక్కడున్నారో పిలవండి అన్నారు. అతను పిల్లలతో ఆడుతున్నాడా సమయంలో. ఉరుకున బాబా సన్నిధికి వచ్చాడు. పిల్లలతో నువ్వు ఆడుకోవచ్చు, అని గద్దించారు.





పాపం! అఫ్‌సేరి తల దించుకొన్నాడు, తప్పు అయిపోయిందంటూ. బాబా ఏమనుకొన్నారో ఏమో, క్లాసులు లేనప్పుడు పిల్లల బాగోగులు నువ్వే చూడు అన్నారు. అఫ్సరీ ఆనందంతో తల వూపాడు.

బాబా తండ్రి పేరు మీకు తెలుసుగా. షెరియార్జీ మూన్దేగర్ ఇరానీకి దైవచింతన ఎక్కువ. భగవదన్వేషణలో 18 ఏళ్ళు దేశాటన చేశాడు. పరిష్యా, అంటే ఇప్పటి ఇరాన్‌లో అనేక ప్రాంతాలు సందర్శించాడు. ఆయన పుట్టిన దేశమూ ఇరానే. భగవంతుడి కోసం పరితపిస్తూ, వూరూరా తిరుగుతూ భారతదేశంలో కూడా చాలా చోట్లకి వెళ్ళాడాయన.

ఏప్రిల్ ఆరవ తేదీ రాత్రి షెరియార్జీ ప్రస్తావన వచ్చింది. ఆయన దేశాటన విశేషాలను బోమాన్ చెప్పాడు. ఆ వివరాలు చెప్పమని బాబానే ఆదేశించారను కోండి. బోమన్ కథనం పూర్తయ్యాక, తన తండ్రి కారణజన్ముడని బాబా అన్నారు. ఆధ్యాత్మిక జ్ఞానార్జన కోసం షెరియార్జీ పడిన కష్టాలని మాటల్లో చెప్పలేము. సత్య మార్గంలో తీర్థ యాత్రికుడు. అందుకనే ఆయనకి బిడ్డగా జన్మించాను. షెరియార్జీ కుటుంబంలో కానీ, యావత్ ప్రపంచంలో కానీ ఈ విశ్వమానవ ప్రసంగాన్ని పునాదులతో సహా కదిలించగల పరాత్పరుడికి తండ్రి కాదగిన వ్యక్తి షెరియార్జీ, ఒక్కరే అని బాబా చెప్పారు.

## మీ ఇష్టం

షాహనేమామయ్య, భార్య, మనూతాయి. ఆమె టీ తీసుకోదు.

టీ త్రాగవద్దని బాబా ఆదేశించారామెని. అందుకని టీమానేసింది.

ఇదొక ధర్మ సందేహం. ఒక్కసారి టీ త్రాగనీయి బాబా. టీ తీసుకోపోతే మా బంధువులు నన్ను తప్పుపట్టవచ్చు అని బాబాకి మనూతాయి వినిపించింది. సరే, నీ ఇష్ట ప్రకారం కానీ అన్నారు. అయితే, వో చిన్న చురకవేశారు. నా ఆదేశాన్ని మార్చమని అడగకూడదు. అది చాలా తప్పు. నేను ఏదైనా ఆజ్ఞ ఇస్తే, ఆంక్ష విధిస్తే, తూ.చ. తప్పకుండా పాటించాలి. నా ఆదేశాలని నా అంతట నేనుగా వెనక్కి తీసుకోవాలి. నేను నా ఆజ్ఞలని ఉపసంహరించుకొంటే సరేసరి. కాకపోతే, మీరు నా ఆదేశాలని అమలుచేసి తీరాలిసిందే. సర్వకాల సర్వావస్థల్లో మీరు నా ఆజ్ఞలని ఉల్లంఘించకూడదు. నా మాటకు కట్టుబడి ఉండాలి. ఆ ఆదేశాల్లో మార్పులు చేయమని మీరు అడగవచ్చు. నేను మీ కోర్కెని కాదనను. మీరు కోరిన సవరణలు ఇస్తాను. కానీ, మీరో సంగతి గుర్తుంచుకోవాలి. ఒక్కసారి నా ఆదేశాల్లో సవరణచేస్తే, ఆ ఉత్తర్వుల పట్టు తగ్గుతుంది. ఇందువల్ల ఫలితం అనుభవించక తప్పదు. ఇది మీకే నష్టం, అని స్పష్టం చేశారు.

పిల్లలకి తండ్రి అంటే అపారమైన ప్రేమ, గౌరవం. ఆయన్ని ఆరాధించే వారంటే అతిశయోక్తిలేదు. మా నాన్నకి మానాన్నే సాటి. ఆయనంతటి కరుణామూర్తి మరొకరుండరు. గొప్ప జాలిగుండె ఆయనది అని ఆదీ జూనియర్ (బాబా తమ్ముడు) అనేవారు.

షెరియార్జీ కథ అవుతూనే, బాబా నాకు విపరీతంగా కడుపు నెప్పిగా వుందన్నారు. బాబాకి కడుపు నెప్పా? నా భక్తులు నన్ను అతిగా తిను, ఇది తిను అని వొత్తిడి చేస్తారు. వాళ్ల తృప్తి కోసం సరేనంటాను, కానీ, నేనేమో ఇలా బాధపడతాను, అన్నారు చిరునవ్వుతో.

పొట్టలో గుడగుడ మంటున్నట్లే వుంది. నిన్నరాత్రి సరిగా నిద్ర పట్టలేదు అన్నారు.

ఏప్రిల్ మొదటి వారంలో సరోష్ కె. ఇరానీ వచ్చాడు. బాబా మండలితో మంజిల్-ఇ-మీమ్ (బొంబాయి)లో కొంతకాలం వున్నాడు. ఇప్పుడు అహమ్మద్‌నగర్‌లో వ్యాపారం చేస్తున్నాడు. ఈ మధ్యనే, అంటే మార్చి 17వ తేదీన పూనాలో 'విలూ' అనే పార్శీ ఆడబడుచును పెళ్ళి చేసుకొన్నాడు. నగర్‌లో ఖుస్రూ క్వార్టర్లలో మకాంపెట్టారు. బాబాని ఎప్పుడూ చూడలేదు. అందుకని ఇద్దరూ వచ్చి బాబా దర్శనం చేసుకొన్నారు.

బాబా రమ్మన్న ప్రతిసారీ సంతోష్ మెహెరాబాద్‌కి వచ్చేవాడు. బాబా అంటే అచంచల విశ్వాసం. అవన్నీ అతడ్ని మండలిలో వొకడిగా చేసింది. వ్యాపారలావాదేవీల్లో నిత్యం కొట్టుకొంటున్నా, మండలిలో వొకడు కాగలిగాడు అంటే సంతోష్ ఎంతగొప్ప బాబా ప్రేమికుడో మీరే ఊహించగలరు.

ఏప్రిల్ 8వ తేదిన బాబా మండలివారితో ఇష్టాగోష్ఠి జరిపారు. బాలుర ఆశ్రమం పెడితే ఎట్లా వుంటుందని అడిగారు. అప్పుడు సమయం ఐదు అయింది. 'ఇంట్లో నేను వేసే ప్రశ్నలకి నిర్మోహమాటంగా జవాబు చెప్పండి. మనసులో మాట పైకి స్పష్టంగా చెప్పలేకపోతే ఏమౌతారో తెలుసా? వచ్చే జన్మలో కప్పలుగా పుడతారు. చైనాలో కనీవినీ ఎరుగని స్థాయిలో పెద్ద యుద్ధం వస్తుంది. అప్పుడు చైనీయులు మిమ్మల్ని వూరగాయలా చేసుకొని శుభ్రంగా తినేస్తారు! జాగ్రత్త! అని హెచ్చరించారు.

ఇంతకీ ఆనాటి గోష్ఠిలో తేలింది ఏమిటీ అంటే, పిల్లల ఆశ్రమం పెట్టాలని. షాహనే కుటుంబం గతంలో వున్న ఇంటిలోనే ఆశ్రమం ఏర్పాటు చేయాలి దరిమిలా కొత్త ఇల్లు కట్టాక అందులోకి మార్చాలి. అప్పటికే స్కూలులో 70 మంది పిల్లలున్నారు. వారిలో 15 మందికి భోజనవసతి సౌకర్యాలు కల్పించారు.

ఎప్పటిలానే, ఇప్పుడుకూడా, ఆశ్రమ నిర్వహణ విషయంలో, బాబా కొన్ని నియమాలు విధించారు. ఆశ్రమం బయట వాళ్ళతో పిల్లలకి ఎలాంటి సంబంధం వుండకూడదన్నారు. ఆశ్రమ నిర్వహణ చూసే మండలి వారితో తప్ప మిగిలిన మండలి వారిని కూడా కలవకూడదన్నారు.





ఆశ్రమ వ్యవహారాలను చూసే బాధ్యతని బెహ్రాంకి అప్పగించారు. పెండూ, సిద్ధూ, ఛగన్‌లను అతనికి చేదోడుగా వుండమన్నారు. మండలి మేనేజరుగా రుస్తుమ్‌ని నియమించారు. అందరికీ తలో పేరు పెట్టారు. మెహెరాశ్రమం మేనేజరు కాబట్టి బెహ్రాంను బువాసాహెబ్ అన్నారు. మండలి మేనేజరు రుస్తుంను బడాసాహెబ్ (పెద్ద బాస్) అన్నారు. అఫ్సరీని రావ్ సాహెబ్ అన్నారు. ఎందుకంటే? పిల్లల తిండి, పడక వ్యవహారాలు చూడాలి కాబట్టి.

బాబా తమ్ముడు జాల్‌ని తన అవసరాలు గమనించమన్నారు. అందుకని అతను బాబా 'ఆర్డర్లీ' అయ్యాడు. హజరత్ బాబా జాన్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా ధాకేని, టీచరుగా విష్ణునీ నియమించారు. డిస్పెన్సరీలో పని చేస్తున్న పాద్రిని రోజు మూడుగంటల సేపు పాఠాలు చెప్పమన్నారు. మండలి వారందరికీ తలో పనీ అప్పగించారు. స్కూలు నియమ నిబంధనలు రూపొందించారు. స్కూలు టైమ్ టేబులు తయారు చేశారు. ఇవి మే ఒకటవ తేదినుంచి అమలులోకి వస్తాయని బాబా చెప్పారు.

ఏప్రిల్ 9వ తేదీన బాబా వో కొత్త ఉత్తర్వునిచ్చారు. అది ఏమిటి? స్కూలులో మరో మూడు క్లాసులు వుండాలి. అంటే, మెస్ క్వార్టర్లలో వుంటున్న పురుషమండలికి అక్కడి నుంచి కదలక తప్పదన్నమాట. మీరు ప్రస్తుతానికి ఉపాసినీ సరాయి (ధర్మశాల)కి మారండి. మీ కోసం త్వరలోనే గదులు కట్టిస్తామన్నారు. కాసేపటి తర్వాత, బాబా ఆరంగావ్ వెళ్ళారు. అక్కడ ఫ్యామిలీ క్వార్టర్లలో (ఒకప్పుడు షాహనే కుటుంబం వున్నవాటా) స్కూలుకోసం మార్పులు, చేర్పులు ఎలా జరుగుతోందో పరిశీలించారు.

జోపిడీ దగ్గర పెద్ద పందరి వేయిస్తున్నారు. ఈ బాధ్యతని 'రాయ' అనే వానికి అప్పగించారు. రామనవమి సంబరాలకి చాలా మంది వస్తారు కదా. వారంతా కూర్చోడానికని బాబా పందిరి వేయమన్నారు. ఎంతో జాగ్రత్తగా రాయా పని చేస్తున్నాడు కానీ ప్రమాదవశాత్తూ, జోపిడి కప్పు నుంచి పెంకు జారిపడింది. బాబాకి వెంటనే ఎక్కడలేని చిరాకు, కోపం వచ్చాయి. బాబా సంగతి మీకు తెలుసుగా పాఠక మహాశయా! ఆయన వెంటనే రామనవమి సంబరాలని రద్దు చేశారు. పాపం మండలి వారు నోరువిప్పితే వొట్టు. మర్నాడు కూడా ఖిన్నులయి కనిపించే సరికి దయామూర్తి ద్రవించాడు. సరే 'మీ మండలి క్వార్టర్లలో రామనవమి పండగ చేసుకోండి' అన్నారు. అంగల్ ప్లీడరు ఎప్పటిలా పండగ ప్రాశస్త్యం వివరించాడు. రామాయాణ కథలని చెప్పాడు. బాబా అందరికీ ప్రసాదం పంచారు.

ప్రసాదం పంచి పెడుతున్న బాబా సడన్‌గా ప్రసాదం ఇవ్వటం ఆపేశారు ఏమయిందా అని అందరూ బాబా కేసి ఆత్రంగా చూశారు. "నేను మౌన విరమణ చేసే లోగానే గాంధీ మహాత్ముడు కన్నుమూస్తాడు. నా వాక్కు వినే యోగ్యత విధాత ఆయనకి

రాయలేదు. ఐనా నా మాట వినటానికి గాంధీ ఆధ్యాత్మికంగా రెడీగా లేదు. అసలు అందుకోసం ప్రయత్నం చేస్తేనే కదా! లేకపోతే, ఎప్పుడో నా దగ్గరకి వచ్చేవాడు. గాంధీ వెంట వున్న వాళ్ళు ఆయన్ని ఇక్కడకి రానివ్వరు. వాళ్ళను వదిలించుకొనే ధైర్యమూ గాంధీకి లేదు, అని బాబా అన్నారు.

ఏప్రిల్ 11వ తేదీన మౌనం గురించిన ప్రస్తావనవచ్చింది. మౌనంగా ఎందుకు వుంటున్నావు బాబా అని ఒకరు అడిగారు. తన మౌనానికి ఆధ్యాత్మిక కారణాలున్నాయని బాబా పేర్కొన్నారు.

ఏ కారణమూ లేకుండానే నేను మౌనం పాటించడం లేదు. నా మౌనానికి ఆధ్యాత్మిక విశిష్టతా లేకపోలేదు. నా సర్కిల్‌లోని వ్యక్తులు అందరికీ బ్రహ్మైక్య వరం సిద్ధించాలి. ఇందుకోసం వారి బరువుని నా భుజాలపై వేసుకొన్నాను. లేకపోతే, వాళ్ళు శారీరకంగా చాలా ఆటుపోటులు తట్టుకోవాల్సివస్తుంది. నేను ఇలా మౌనం పాటించడం వల్ల వాళ్ళ బరువుని మోయగలుగుతున్నాను. వాళ్ళ సాధక బాధకాలని తగ్గించగలుగుతున్నాను. ఇలా మౌనం పాటిస్తుంటే నా శరీరం బాగా దెబ్బతింటుంది. మంచినీళ్ళు త్రాగటం కష్టమవుతుంది. ఆహారం తీసుకోవటం సాధ్యం కాదు. నా ముఖం ఎంతగా మారిపోతుందంటే, అది కేవలం ఒక పుర్రెలాగా మిగులుతుంది. మామూలు పుర్రెగా కాదు సుమా. బాగా కృశించిన పుర్రెగా మారుతుంది. నా చేతులు, కాళ్ళు కొంకర్లు పోతాయి. పక్షవాతం వచ్చిన వ్యక్తి చేతులు, కాళ్ళు మాదిరిగా. అది నా శారీరక అవస్థలో ఆఖరి దశ. ఆ దరిమలా నేను పెదవి కదిపి మాట్లాడుతాను" అని బాబా వివరించారు.

మెహెరాశ్రమంలో పిల్లలని చేర్చుకోవాలి కదా. ఎక్కడెక్కడి పిల్లలని ఎలా చేర్చుకోవాలన్న విషయమై ఆ వేళ కాసేపు చర్చించారు. మెహెరాశ్రమానికి సంబందించిన పత్రికా ప్రకటన ఎలా, ఏ ప్రకారంగా ఇవ్వాలి అని కూడా తర్జన భర్జన జరిగింది. మెహెరాశ్రమంలో పరిష్యా పిల్లలని కూడా చేర్చుకొందామన్నారు బాబా. 'బైదుల్‌కి కబురు పంపు. అక్కడి పిల్లలని సెలక్షన్ చేయమని చెప్పు అని రావు సాహెబ్‌ని ఆదేశించారు. బైదుల్ పరిష్యాతో వున్న సంగతి పాఠకులకి తెలుసుకదా. బాబా ఆజ్ఞ మేరకి, పిల్లలకి పాఠాలు చెప్తున్నాడక్కడ. రావు సాహెబ్ బురాసాహెబ్‌లు కూడా పరిష్యా వాసులేనేమో బాబా మాట విని ఆనందంతో వుబ్బితబ్బిబ్బయ్యారు. బాబా చెప్పినట్లే, బైదుల్‌కి రావు సాహెబ్ వుత్తరం వ్రాశాడు. పరిష్యా నుంచి ఇండియా రావడానికి అయ్యే ఖర్చు సంగతి, ఆ ఖర్చు నేనే భరిస్తానన్నారు బాబా.

ఈ మధ్య చాలా రోజులుగా బాబా మెడ బాగా బిగబట్టి బాధపడుతున్నారు. తలపోటుకూడా వస్తోంది. మండు వేసవి కాలమయినా సరే, వులెన్ కోటు, మెడచుట్టూ కండువా వేసుకొంటున్నారు.

ఏప్రిల్ 12 నాటికి మెడ నెప్పి ఎక్కువైంది. మెడనేమాత్రం కదపలేకపోయారు. మెడ





బిగుసుకు పోయినట్లుందన్నారు. బుర్రలో నరాలు, నాడులు విపరీతంగా లాగేస్తున్నాయి. వీటన్నింటినీ పట్టి కుదించి భూమికి లాగుతున్నట్లుంది అన్నారు.

కాసేపు మౌనంగా ఆ బాధని అలా అనుభవించాక స్కూలు మేనేజిమెంటు చూస్తున్నవాళ్ళని పిలవండి అన్నారు. ధాకే, ఛాన్జీ వచ్చారు. మిగితా వాళ్ళు వచ్చారు.

స్కూలు నడుస్తున్న తీరు నాకు సంతోషంగా లేదన్నారు. "అదేమిటి? బాబా, అలా అంటారు? నేను మనస్సు పెట్టి పనిచేస్తున్నాను" అని ధాకే అన్నాడు. అతగాడు స్కూలు ప్రిన్సిపాల్ కదా! నా పని మీకు నచ్చకపోతే, రాజీనామా చేస్తానన్నాడు. ఛాన్జీ, విష్ణు, పాద్రి, నిసాల్ అప్పుడక్కడే వున్నారు. మీరెవరైనా స్కూలు ప్రిన్సిపాల్‌గా వుంటారా? అని బాబా అడిగారు. వాళ్ళెవరూ అందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. మా అందరిలోనూ ధాకేనే తగినవాడు స్కూలు పనికి అని చెప్పారు. వీళ్ళ ధోరణి బాబాకి నచ్చలేదు. రుసరుసగా తన జోపిడికి వెళ్ళిపోయారు.

కాసేపయ్యాక ఛాన్జీ, ధాకేలకు జోపిడినుంచి పిలుపువచ్చింది. ఆదరా బాదరా బాబా సమక్షానికి తరలివచ్చారు.

స్కూలు మూసేయాలని బాబా చెప్పారు. అలా అయితే మెహెరాబాద్‌నే మూసేయండి అన్నాడు ఛాన్జీ. మండలివారిని, స్కూలు పిల్లలనీ మూటా–ముల్లె సర్దుకొని వాళ్ళ వూరుకి పొమ్మనండి అన్నాడు. ఛాన్జీ గొంతుతో వెటకారంకంటే, కోపం, బాధ తొంగిచూశాయి. బాబా చాలా తాపీగా బదులుచెప్పారు. మండలి వారిని ఇక్కడ వుండనిస్తానని మాటయిచ్చాను. ఐతే, ఇక్కడ మెహెరాబాద్‌లో జరిగే ప్రతిపనీ నాకు సంతృప్తి కల్గించాలి" అని స్పష్టం చేశారు.

ఛాన్జీ తన పట్టు వదల్లేదు. స్కూలు నడపడానికి తగిన వ్యక్తి ధాకే అన్నాడు. 'బాగా చదువుకొన్నాడు. కావాల్సిన అర్హతలున్నాయి. స్కూలుల్లో అందరూ ఎలా పని చేస్తున్నారో ఓ కంట కనిపెట్టి చూస్తున్నాడు. ఇంకేం కావాలి? అని ధాకే తరపున వకాల్తా పుచ్చుకొన్నట్లుగా మాట్లాడాడు.

సరే, అలా అయితే మీ ఇష్టం అన్నారు బాబా. పనిలో మరింత శ్రద్ధ చూపించమని ధాకేకి చెప్పారు. ఆ వేళ బాబా జోపిడీలోనే గడిపారు.

ఆవాల్టి నుంచీ జోపిడికి బాబా మారినట్లే చెప్పాలి. అడపాదడపా టేబుల్–కాబిన్‌లో కూడా వుంటున్నారు.

షాహనేమామయ్య, భార్య, మనూతాయి, పిల్లలతో ఏప్రిల్ 14న మెహెరాబాద్ వచ్చారు. బాబా దర్శనం చేసుకొన్నారు. ఇక్కడి నుండి మనూతాయి కొల్హాపూరు వెళ్ళాలనుకొంటోంది. ఆమె టీ తీసుకోదు.

టీ త్రాగవద్దని బాబా ఆదేశించారామెని. అందుకని టీమానేసింది. చాలా కాలంగా.

కొల్హాపూర్‌లో బంధువులు టీ తీసుకోమని బలవంతంపెడితే, ఏం చేయాలి?

ఇదొక ధర్మ సందేహం. ఒక్కసారి టీ త్రాగనీయి బాబా. టీ తీసుకోపోతే మా బంధువులు నన్ను తప్పుపట్టవచ్చు అని బాబాకి వినిపించింది. సరే, నీ ఇష్ట ప్రకారం కానీ అన్నారు. వో చిన్న చురకవేశారు. నా ఆదేశాన్ని మార్చమని అడగకూడదు. అది చాలా తప్పు. నేను ఏదైనా ఆజ్ఞ ఇస్తే, ఆంక్ష విధిస్తే, తూ.చ. తప్పకుండా పాటించాలి. నా ఆదేశాలని నా అంతట నేనుగా వెనక్కి తీసుకోవాలి. నేను నా ఆజ్ఞలని ఉపసంహరించుకొంటే సరేసరి. కాకపోతే, మీరు నాఆదేశాలని అమలుచేసి తీరాలిసిందే. సర్వకాల సర్వావస్థల్లో మీరు నా ఆజ్ఞలని ఉల్లంఘించకూడదు. నా మాటకు కట్టుబడి ఉండాలి. ఆ ఆదేశాల్లో మార్పులు చేయమని మీరు ఆడగవచ్చు. నేను మీ కోర్కెని కాదనను. మీరు కోరిన సవరణలు ఇస్తాను. కానీ, మీరో సంగతి గుర్తుంచుకోవాలి. ఒక్కసారి నా ఆదేశాల్లో సవరణచేస్తే, ఆ ఉత్తర్వుల పట్టు తగ్గుతుంది. ఇందువల్ల ఫలితం అనుభవించక తప్పదు. ఇది మీకినష్టం, అని స్పష్టం చేశారు.

ఆ వేళ మధ్యాహ్నం ఆదీ. కె. ఇరానీ (పెద్ద ఆది) నిద్రపోతూ కనిపించాడు. పగటి పూట కునికి పాట్లు పనికి రాదని హెచ్చరించారు. అలా కునికిపాట్లు పడితే, బాధ్యతలు, విధులు విస్మరించినట్లు లెక్కన్నారు. ఇలా రోజూ మధ్యాహ్నం నిద్రలోకి జారు కొంటూంటే, ఆదీకి వో రోజున బాగా దేహ శుద్ధి చేస్తాను. మళ్ళీ మరచిపోడు. చచ్చిపోయేవరకు గుర్తుంటుంది అన్నారు.

ఏప్రిల్ 15వ తేదీన మళ్ళీ బాబా స్కూలు పనితీరు బాగా లేదన్నారు. ఛాన్జీ, ధాకేలని తప్పుపట్టారు. మీరు నాకు సంతుష్టి కలిగేలా స్కూలు నడపటం లేదన్నారు.

సంజాయిషీ చెప్పండి అని నిలదీశారు.

ఛాన్జీ, ధాకే మనసులో మాట చెప్పేశారు.

"నిన్ను సంతృప్తి పరచడం మాతరం కాదు బాబా" అన్నారు.

"నువ్వు సిద్ధుడవి.

మేము సామాన్యులం.

నువ్వెక్కడ మేమెక్కడ?

అందుకనే మేము ఏ పని చేసినా నిన్ను మెప్పించలేమూ" అన్నారు. స్కూలు పనికి సంబందించి నీ ఆదేశాలని తూ.చ. తప్పకుండా పాటించడం చాలా కష్టమని తేల్చి చెప్పేశారు. "మేము చేసేపనిలో మాకేమాత్రం స్వేచ్ఛలేదు. ఫలానా ప్రకారంగా చేస్తే బాగుంటుందనిపించినా, మాకా అధికారం లేదే.

కేవలం నీ ఆజ్ఞ ప్రకారం నడుచుకోవటమే మా విధి.





మా కర్తవ్యం. మా ప్రతి పనినీ నువ్వు నిఘావేసి చూస్తావు. నీలా సిద్ధ పురుషులం కాదు కాబట్టి, మా పని నీకు సంతుష్టినివ్వదు అన్నారు.

వీళ్ళ మాటలు విన్న బాబా ఇలా స్పందించారు "ఈ స్కూలు అన్ని స్కూళ్ళ వంటిదికాదు. ప్రపంచంలో మీరు చూసే స్కూళ్ళని ప్రభుత్వం నడుపుతోంది. పురపాలక సంఘాలు, ధర్మార్థ, సేవా సంస్థలు నడుపుతున్నాయి. అటువంటి స్కూలు కాదు మెహెరాశ్రమం. ఇక్కడ చెప్పే చదువు మామూలు చదువుకాదు. ఆధ్యాత్మిక విద్యా భోధన కోసం మెహెరాశ్రమాన్ని నెలకొల్పాము. ఈ లక్ష్య సాధన చాలా కష్టం. ఎన్నో కష్టనష్టాలని ఎదుర్కోవలసివస్తుంది.

'కష్టేఫలి' అంటారు కదా. అలా కష్టపడిన కొద్దీ మీకు ఫలితం చేకూరుతుంది. చిత్తశుద్ధితో విధి నిర్వహణచేయండి. పారమార్థికత నశించి పని చేయండి. ఈ మెహెరాశ్రమ నిర్వహణ బాధ్యతని అతి ఉత్కృష్టమైన విధిగా చేపట్టి చేయండి. అప్పుడే మీరు నన్ను సంతుష్టి పరుస్తారు.

"మెచ్చుకోలుతో ఉబ్బిపోకండి. విమర్శలకి కృంగిపోకండి. మీకు అప్పగించిన పనిని మనసా వాచా చేయండి. బాబా అప్పగించిన పనిని సక్రమంగా నిర్వహించామని అంతరాత్మ మీకు చెప్పాలి. అంతరాత్మనిమించిన జడ్జి మరొకరు లేరు. పొరపాటు చేయడం మానవనైజం. తప్పులు దొర్లుతాయి. బెంబేలు పడకూడదు. మీరు మీ శక్తి మేరకి పని చేస్తారు. ఎప్పుడూ టైమ్ ప్రకారం వెళ్ళండి. మీరు చేయాల్సిన పనిని ఇంకొకళ్లకి అప్పగించకండి. మీ పనిని మీరే చేయండి. ఒకవేళ మీరు తప్పు చేస్తే నేను పట్టించుకోను. క్షమించి వదిలేస్తాను నేను గట్టిగా దండిస్తే? దండిస్తే దండిస్తాను. అని మనస్సులో పెట్టుకొని కృంగిపోకండి", అని బాబా వివరించారు.

ఏప్రిల్ 18వ తేదీన రావ్ సాహెబ్ బాబా దగ్గరకివచ్చాడు. వో ఆరంగావ్ కుర్రాడు పద్ధతి నచ్చటంలేదన్నాడు. అతగాడిపేరు? రామజీ రేయోజి కాంబ్లే నా దగ్గరకి రమ్మని కబురు పెట్టారు. ఆ కుర్రాడు వచ్చాడు. "ఏం, ఇక్కడవుండాలని లేదా? ఇంటికి వెళ్ళిపోతాడా" అని అడిగారు. ఇంటికి వెళ్ళి పోవాలనిపిస్తోందన్నాడు. అతని తండ్రిని పిలిపించారు. నువ్వు అయినా చెప్పు నీ కొడుక్కి', అన్నారు. పాపం తండ్రి ఎంత చెప్పినా, కాంబ్లే వినలేదు. ఇంటికి వచ్చేస్తానని పట్టు పట్టాడు.

బాబా కలుగ చేసుకొని, 'ఇక్కడ ఏమైంది. ఇంటికి వెళ్ళాలని ఎందుకనిపిస్తోంది, అని అడిగారు. కాంబ్లే నోరు విప్పలేదు. బాబా వో సలహా ఇచ్చారు 'కాంబ్లేని ఆశ్రమ పిల్లలతో వుంచకండి. పురుషమండలి వాళ్ళదగ్గర వుంచండి అన్నారు. ఈ మాటవింటూనే కాంబ్లే మోహం వెయ్యి వాట్ల బల్బులా వెలిగింది. బాబా చెప్పినట్లు పురుషమండలితో వుంటానన్నాడు. బాబా సంతోషం వ్యక్తం చేశారు. కాంబ్లే మంచికుర్రాడు. కాస్తంత గర్విష్టి అంతే. దాదాబాయి నవరోజీని కాంబ్లే ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన బ్రిటీషు పార్లమెంటుకి ఎన్నికయిన

మొదటి భారతీయుడు. వినమ్రతకి మారు పేరాయన. విద్యార్థి దశలో వీధి దీపం దగ్గర చదువుకొన్నాడు. పరువు ప్రతిష్ఠ పెరిగిన తర్వాతకూడా మనిషి స్వభావంలో మార్పు రాలేదు. గర్వం ఏమాత్రం కనిపించేది కాదు. అటువంటి వ్యక్తి మీకు ఆదర్శం అన్నారు.

ఈ సంఘటన జరిగిన రెండురోజులకి అంటే ఏప్రిల్ 20న పురుషమండలి కోసం కొత్త ఇల్లు కట్టడం మొదలుపెట్టారు. ఆ మర్నాడు రాయా సాఖరేకి కొడుకుపుట్టాడు. రాయా ఆనందానికి హద్దులులేవు. నీకు కొడుకుపుడతాడని బాబా వరమిచ్చారు. అందుకని కొడుకు బాబా వరప్రసాదమని బాబాకి శతకోటి దండాలుపెట్టాడు. ఆ మధ్యాహ్నం టీ పార్టీ ఇచ్చాడు. శంకరనాథ్ అహమ్మద్‌నగర్‌కి వెడుతున్నాడని ముందుగా అతనికే స్వీటు పెట్టి టీ ఇచ్చాడు. బాబాకి కోపం వచ్చింది. ముందు నాకు పెట్టాకే, ఇంకెవరికయిన ఇవ్వాల్సిందని కటువుగా అన్నారు. "అయ్యో! పొరపాటైంది బాబా అని రాయా నొచ్చుకున్నాడు.

'బాధపడకు. జరిగింది ఏదో జరిగిపోయింది. నీ కొడుకు నెల నిండాక మరో టీ పార్టీ ఇయ్యి. అప్పుడు ముందుగా నాకే తీపి పెట్టాలి సుమా', అన్నారు బాబా నవ్వుతూ.

వాతవరణం తేలికపడింది. *(సశేషం)*

# తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం, రామారావుపేట సెంటర్‌లో మెహెరుని మై విష్ సందేశ స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా జరిపినట్లు డా॥ వై. విజయ సారథి ఒక ప్రకటనలో తెలిపారు.

# సంతాపం

అవతార్‌మెహెరు పత్రిక సంపాదకులు చంద్రమౌళీశ్వరరావు యిక లేరు. 12.05.2008న ప్రియతమ బాబా ఒడిలో శాశ్వతంగా విశ్రమించుటకు వెళ్ళారు. శేష జీవితంలో ఎన్నో మానసిక, శారీరక యిబ్బందులకు లోనైనా, సుపుత్రుని ఆదరణలో, పత్రికా బాధ్యతల్ని సమర్థవంతంగా నెరవేర్చిన ధన్యుడు. ఆతనితో మా పరిచయం మూడు దశాబ్దాలు పైబడినదే. దాపరికం లేకుండా మనుస్సులో నున్నది తరచు తన సంపాదకీయాల్లో అందరితో పంచుకునే ధీశాలి. బాబా సత్య ప్రేమ సందేశాలకే ప్రాధాన్యతనిస్తూ, వార్తలు, విశేషాలకు యదాతథంగా అతి క్లుప్తంగా చోటిచ్చేవారు. అవతార్ మెహెరు పత్రికా గత వైభవానికి అద్దం పట్టేటట్లు శ్రమించే దీశాలి.. ఆతని లోటును భర్తీ చేయుట కష్టమే. బాబా సందేశాలు, ముఖ్యంశాలు శీర్షికతో మా వ్యాసాల్ని క్రమం తప్పకుండా, యధాతథంగా పత్రికలో ప్రచురించేవారు. ఇది పాఠకులకు పరిచయమే. మా ప్రగాఢ సంతాపాన్ని, వారికుటుంబీకులకు, మనసారా అర్పిస్తున్నాము. బాబా సేవలో ఆయన నామ వ్యాప్తికై, ఏనాటికైనా అందరం బాబా ఒడిలో కలుసుకుంటాం

***– త్రినాధ్ రథో, విశాఖ***





# తోట పద్మనాభ రావు

తోట పద్మనాభం (కాకినాడ) మే 21న తన దివ్య ప్రియతమునిలో లీనమయ్యారు.

ఇటీవల చెన్నై సహవాస్‌కు హాజరయి, తన అల్లుడు శ్రీఅప్పారావ్ ఒరిస్సా రాష్ట్రంలోని కటక్‌లో రోడ్డు ప్రమాదంకు గురయ్యారని తెలిసి, అక్కడికి చేరిన పద్మానాభంగారు, స్వల్ప అస్వస్థతతో స్థానిక ఆసుపత్రిలో చేరడం, అనంతరం రెండు మూడ్రోజుల చికిత్సానంతరం తీవ్ర గుండెపోటుతో అవతారునిలో లీనమవడం చకచకా జరిగిపోయాయి.

ఆయన వయస్సు 75 సంవత్సరాలు. ఏడు పదు వయస్సు దాటినవానిలా కనపడేవారు కాదు. బక్క పల్చగా, చొక్కా పొంటులోపలికి వేసుకుని, నిరాడంబరంగా, నవ్వుతూ పలకించేవారు.

జైబాబా అని దగ్గరగా వెళ్తే, కుర్చీలో కూర్చున్నాయన గౌరవంగా లేచి నిలబడి ప్రేమతో ఆలింగనం ఇచ్చేవారు. నెమ్మదిగా– ఆచి తూచి మాట్లాడే వ్యక్తిత్వం ఆయనది.

**'మెహెర్‌బాబా పత్రికకు తొలినాళ్ళనుండి ప్రోత్సహించే రీతిలో అనేక సలహాలు ఇచ్చారాయన. పత్రిక ప్రారంభపు రోజుల్లో, ఓ మారు అమరతిథిలో కల్సినప్పుడు, మెహెర్‌బాబా పత్రిక గురించి మాట్లాడుతూ పత్రిక బాగుందన్నారు. ఐతే, బాబా సాహిత్యం మేం చాలా భాగం చదివాం. క్రొత్తగా మీరైనా ఏం ప్రచురించగలరు. క్రొత్త పత్రికగా మావంతుగా తప్పక సహకరిస్తామని నవ్వుతూ అన్నారు'.**

ఇటీవల ఆయనతో – ఆ మాటల్ని గుర్తుచేస్తే, మా భుజం తట్టి పత్రిక బాగుందని, ఇలాగే కొనసాగించాలని తమ వార్షిక సభ్యత్వం ఇచ్చారు. కాకినాడ వాస్తవ్యులు ఏడద సత్తిరాజు గారి ద్వారా 1966లో తాను బాబా పరిధిలోకి వచ్చానంటూ ఒక సందర్భంలో చెప్పారు. ఏడిద సత్తిరాజుగారి గురించి మెహెర్‌బాబా సంచికలో రాస్తున్నప్పుడు ఆయన గురించి రెండు మాటలు చెప్పమంటే– ఫోన్లోనే ఎన్నో విషయాలు, విశేషాలు, సత్తిరాజుగారు గురించి చెప్పారు. ఆయన పిల్లలందరికన్నా 'రాజుగారు' గురించి నాకే బాగా తెలుసన్నారు. వారి ఇంట్లోనే మా పిల్లలందరూ పెరిగి పెద్దవాళ్ళయ్యారని చెప్పుకొచ్చారు. నాకు తండ్రిలాంటి వారు సత్తిరాజుగారన్నారు.

మనుషుల మధ్య తారతమ్యాలు పెరుగుతున్న వేళ తమ రక్త సంబంధీకులకన్నా మిన్నగా సత్తిరాజుగారితో తనకు గల అనుబంధం గురించి చెప్తుంటే ఆశ్చర్యం వేశింది.

అవతారుని సాహిత్యం ఆసాంతం ఆకళింపుచేసుకున్నారాయన.

బాబా చెప్పిన చిన్న చిన్న కథలను తన చుట్టూతా చేరిన ప్రేమికులకు సందర్భానుసారంగా చెప్తుండేవారు. బాబా ప్రేమికులందరికీ ముఖ్యంగా తూర్పు ఆంధ్రులకు సన్నిహితునిగా మెలిగిన తోట పద్మానాభంగారి అకాల మరణం బాబా ప్రేమికులందరికి గొప్ప తీరని లోటు. అవతారుని పిలుపు మేర ఆయన దరిచేరిన ధన్యుడాయన.

## బాబాలో ఐక్యం

అవతార్ మెహెర్‌బాబా వారి ఆంధ్ర పర్యటనతో వారిచే ఆంధ్ర నెపోలియన్‌గా పిలువ బడిన ప్రముఖ న్యాయవాది స్వర్గీయ శ్రీ జోశ్యుల వెంకటేశ్వరారావు గారి కుమార్తె, పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలో గత ఎనిమిది సంవత్సరములుగా మెహెర్‌బాబా సహవాస్ కార్యక్రమములు నిర్వహిస్తున్న శ్రీమతి పేరూరి విజయలక్ష్మిగారు 21.2.2008 ఫిబ్రవరి 2008న ఉ॥ 6 గంటలకు బాబాలో ఐక్యమయ్యారని ఆమె భర్త పి.వి.ఎస్.ఎన్.శర్మ తెలిపారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి కలుగవలెనని అవతార్ మెహెర్‌బాబా ప్రేమికులు ఏలూరు, తణుకు, తాడేపల్లిగూడెం, కొవ్వూరు మరియు రాజమండ్రిల నుండి సంతాపాన్ని తెలియచేశారు.

## సిరిసిల్లా సెంటర్ రజతోత్సవాలు

అవతార్ మెహెర్‌బాబా సిరిసిల్లా సెంటర్ రజతోత్సవాలు జూన్ 15, 2008న సిరిసిల్లా, కరీంనగర్ జిల్లాలో పెద్ద ఎత్తున జరుపుతున్నట్లు స్థానిక సెంటర్ అధ్యక్షులు శ్రీ సామల రాజమల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలు ఉదయం 6 గంటలనుండి మొదలవుతాయని తెలిపారు. శ్రీధర్ కేల్కర్, మెహెరాబాద్, ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని తెలిపారు.

## నిజామాబాద్‌లో ప్రేమిక సహవాస్

అవతార్ మెహెర్‌బాబా నిజామాబాద్ సెంటర్‌లో జూన్ 14 సాయంత్రం 4 నుండి 8 గంటల దాకా ప్రేమిక సహవాస్ నిర్వహిస్తునట్లు, ముఖ్య అతిథిగా శ్రీధర్ కేల్కర్, మెహెరాబాద్ విచ్చేస్తున్నట్లు ఆహ్వానం పంపారు.

## జి. సిగడాంలో ప్రేమిక సహవాస్

శ్రీకాకుళం జిల్లా జి.సిగడాంలో ప్రేమిక సహవాస్ స్థానిక సెంటర్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం, 29.6.2008న ఏర్పాటు చెసినట్లు గౌరవాధ్యక్షులు శ్రీ పి.వి. రంగప్రసాదరావు ( 99850 26433) ఒక ప్రకటనలో తెలిపారు.





# గొప్ప దుర్ఘటన

శ్రీ అప్పారావు- హైదరాబాద్‌లోని డి.ఆర్.డి.ఎల్.లో పన్జేస్తున్నారు. చెన్నైలోని సహవాస్ కార్యక్రమం ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఒరిస్సా రాష్ట్రంలోని కటక్‌కు అధికార పర్యటనకై వెళ్ళారు. ఇక్కడే ఆయన ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో తలకు పెద్దగాయమయింది. మెదడుకు ఆపరేషన్ చేయవల్సివచ్చింది. సుమారు 10 రోజులు కోమాలో వున్న అప్పారావు ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో కోలుకుంటున్నారు. తలకు పెద్ద గాయంతో పాటు ఎడమవైపు చేయి, కాలికి కూడా ఫ్రాక్చర్ అవడం వల్ల వైద్యులు ఆపరేషన్ చేశారు.

ఎంతో ఉత్సాహంగా, నవ్వుతూ, అందర్నీ ప్రేమగా పలకరించే అప్పారావు గారు తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో వుండటం చూసి ఆయన మిత్రులు, బాబా ప్రేమికులు కళ్ళనీళ్ళ పర్యంతరమౌతున్నారు. మెహెర్‌బాబా సాహిత్యాన్ని ఆసాంతం ఆకళింపుచేసుకున్న శ్రీ అప్పారావు, బాబా ప్రవచనాలను ఆచరణలో అమలు చేసే రీతిలో అగుపిస్తారు.

గొప్ప ఆపద ఎదురైనా అవతారుని కృపతో త్వరలో కోలుకుంటారని ఆయన్ని బాగా అభిమానించే బాబా ప్రేమికులు పలువురు అభిప్రాయపడ్డారు. అప్పారావు గారి ఆరోగ్యం త్వరలో కుదటపడాలని, బాబా ప్రేమికులు అందరూ అవతారుడ్ని ప్రార్థించాలని ఆయన మిత్రులు కోరుతున్నారు.

కాకినాడ వాస్తవ్యులు శ్రీ తోట పద్మనాభం గారి అల్లుడయిన శ్రీ అప్పారావు, ఆయనకి జరిగిన ప్రమాదం గురించి తెల్సుకుని పరామర్శించడానికై కటక్‌కు హుటాహుటిన వెళ్ళిన తోట పద్మనాభం గారు గుండెపోటుకు గురై, అక్కడే చికిత్స పొందుతూ 21 మే తేదీన బాబాలో లీనమయ్యారు.

# ఉత్తర ప్రత్యుత్తరాలకు

మా అడ్రస్సు- ఎడిటర్, మెహెర్‌బాబా, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్‌కాలనీ , సికింద్రాబాద్-500 087 ఫోన్: 99595-53218

# బాటసారులు

1940 సం॥ ఏప్రిల్ ప్రారంభంలో బాబా వారి బృందం, యావత్తు సామగ్రితో సహా మెహెరాబాద్‌నకు తరలివెళ్ళిరి. బాబా తనతో బెంగుళూరువద్ద నున్న పెక్కు మందితో కారుమీద కొండలపైన, లోయలందు మనోహరమైన చుట్టుదారి ననుసరించి కార్వార్, గోవావంటి కోస్తా ప్రాంతాలలో అక్కడక్కడ ఆగుచు మే నెలారంభమునకు మెహెరాబాద్‌నకు చేరుకొనిరి.

చట్టిబాబాను అతని సహచర మస్తులతో రైలుపై అహమ్మదు నగరమునకు పంపి, బాబా వచ్చునప్పటికి ముందుగానే గుట్టమీదనున్న ప్రత్యేక గదిలో వసతి నేర్పాటుచేసిరి. అనుదిన స్నానకార్యక్రమము మరల మొదలిడిరి. రోజునకొక స్నానమునకు 150 నుండి 200 చొప్పున బక్కెట్ల నీరు వాడెడివారు. బక్కెటు తరువాత బక్కెట్టుగా నీరు పోయుచుండగా నాతడు జలజలమని ధ్వనిచేయుచు, నిట్టూర్చుచు, సున్నితముగా నవ్వుచునుండెడివాడు.

చట్టిబాబా తనకేశములను ఆరబెట్టుటకు విముఖత జూపు నైజముగలవాడు. అతనికి చిందరవందరగను బూడిదవర్ణపు పొడలతో బిరుసైన జటలతో కర్ణముల వరకు సోకునట్టి నిడుపాటి కేశములుగలవు. ప్రతిదినము నాతడు సాధారణముగా స్నానానంతరము వదులుగానున్న మన్ను లభ్యమగు ప్రదేశమందు కూర్చొని, తన అరచేతులనిండుగా మట్టిని తీసుకుని శిరస్సుమీద జల్లుకొనును. అట్లు గుప్పెళ్ళు గుప్పెళ్లుగా పోసుకొనుచున్న మట్టితునకలు అతని అవనత శిరస్సు నుండి భుజముల మీదుగా నేలకు పొడిపొడిగా రాలుచుండెడి దృశ్యము వింతగా కానుపించెడిది. మనకు కొలువ శక్యముకాని ఒకానొక వేదనతో నున్నట్టుగను, పై రీతి పసిపాపల చేష్టలు అతనికి ఉపశమనము కలిగించునట్లుగను కానుపించును. అతనికి ఇట్టి అలవాటు ఉన్నందుననే బాబా తన పరిచారకుడైన కృష్ణతో చట్టిబాబా గదిలో పదిహేను బక్కెట్లు నిండుగ మట్టితో వుంచు ఏర్పాటుచేసినారు.

పారమార్థిక ప్రేరేపణ కలుగకముందు చట్టిబాబా స్టేషనుమాష్టరుగా నుండెడివాడుకానోపు. అప్పుడప్పుడు ఆ రోజులనాటి స్మృతులు వివిధరీతులలో వచ్చెడివి. ఉదాహరణకు అప్పుడప్పుడతను తన కిటికీలోని ఇనుపఇరుసు కడ్డీతో మోర్స్ సంకేతములను కొట్టుచుండెడివాడు. స్మృతుల పేటిక అంతరాంతరములనుడి తుప్పుపట్టిన జ్ఞప్తి విశేషములను కెలికి వెలికిదీయునట్లు రాత్రిళ్ళు గాని, పగటిపూటగాని ఎప్పుడో నొకసమయమందు రైల్వేశాఖలోని క్రింది ఉద్యోగులకు ఆంగ్లములోను తమిళములోను ఉత్తర్వులు జారీ చేయుచుండును. మరొకప్పుడు "అల్లాహొ అక్బర్, అల్లాహొ అక్బర్" అని బిగ్గరగా కేకలు వేయును. (భగవంతుడు మిక్కిలి గొప్పవాడు. భగవంతుడు మిక్కిలి గొప్పవాడు).

బాబా తన అన్నగారని అతనను చుండెడివాడు. ఒకమారు కృష్ణతో బాబా చాల గొప్పవారని, ధనవంతులని, అట్టి వారు ఈ యావత్ప్రపంచములో వేరొకరు లేరని నుడివెను.





1940 సం॥ మెహెరాబాద్ నాటి రోజులలో ఐరోపాఖండములో ఒక భయానక విషమఘడియలో ఫ్రాన్సు పతనము చెందినది.

ఈ క్రింద సుదహరించువృత్తాంతము బాబా మస్తులతో చేయుకృషి ప్రపంచ సంఘటనల పరిణామముపై ప్రభావము కలిగించు నిదర్శనమని నేను సూచింప కోరను గాని మహర్షులు మానవజాతికి కలిగెడు విషమ విపత్కర ఘడియలందు వారితో కూడ సమముగ వెతలపాలు జెందుదురని నా నమ్మిక. బాబా మస్తులతోడి తన సాంగత్యమునందు వారు ఆయనకు, ఆయన వారలకు చేయూతనిచ్చెదరనియు తన కృషి ప్రాముఖ్యతను గూర్చి వారు చేయునిచ్చెదరనియు వారు తనను ప్రేమింతురనియు, తానును అటులనే వారలను ప్రేమించెదననియూ తన కృషి ప్రాముఖ్యతను గూర్చి వారు చేయు ఊహలు కొంతమట్టుకు నిజమనియు స్పష్టముగ వచించిరి. కాని ఇంతకుమించి విశదీకరింపలేదు ప్రతి మస్తు బాబా కొరకు చేయు కార్యకలాపములు బాబాకును ఆ మస్తులు అభివృద్ధి దశలో నున్నందున వారు తనకొరకు చేయునదెద్దియో తెలిసికొనియుందురు గావున తనకు మిక్కిలి సహకారిగ నుందురనియు చెప్పిరి.

మెహెరాబాద్‌లో చట్టిబాబా కృష్ణతో ఐరోపా ప్రజలు అనేక యిడుములు పాలయి కుందుచున్నారనియు, అనతికాలములోనే మరల మంచి రోజులువచ్చి సుఖముగ నుందురనియు, కొలదివారములనుండి అనేకమారులు చెప్పుచుండెడివాడు. చట్టిబాబా అక్షరాస్యులయ్యు వార్తాపత్రికలను చదువుట ఎవరును ఎప్పుడును చూడ లేదు. అందువలన అతనికి ఏవిధమయిన వర్తమాన వార్తా విశేషములు తెలియునవకాశములేదు. అయినప్పటికి అప్పటిరోజులలో ఐరోపాలోని భయావహ సంఘటనలు అతనికి తెలియునట్లు ఆగుపించెడిది. ఒక దినము మట్టిని తన శిరస్సుమీద వెదజల్లుచు అనేకులు తీవ్రవేదనానుభవమునకు గురయి క్షామమువలన మృతిజెందెదరనియు, చివరకు ఈ క్లేశములనన్నిటిని బాబా ఉపశమింపజేతురనియు చెప్పెను.

1940 సం॥ జూన్ 9 నాటి రాత్రి చట్టిబాబా ఆకస్మాత్తుగా ఉద్రిక్తుడై దుర్భాషలాడుచు వెర్రి ఆవేశముతో ఊగిసలాడుచు తన చిన్న గదినుండి వెలుపలికి వచ్చి తిన్నగా బాబా వద్దకు వెళ్ళెను, అతను బాబాతో తన గృహము ఛిద్రమై కూలిపోయెననియు, బాబా వద్దకు తలదాచుకొనుటకు నచ్చితిననియు చెప్పెను. ఈ పలుకులకు మామూలుగా విన్నచో నది అర్థరహితమైనది. అతను వుండేది చాలీచాలని చిన్న గది. అయినప్పటికి సలక్షణమైనది. అందులో వంటరిగా అనేక గంటల తరబడి కూర్చుండెడివాడు. ఆ గది ఎప్పటివలెనే యున్నది. బాబా వెంటనే తామిద్దరిని కొంత తడవు ఏకాంతముగ నుండనిమ్మని ఆదేశమిచ్చిరి. చట్టిబాబా కొన్ని గంటల సేపు బాబాతో తీవ్రభాషణ, వాదనలు చేయుట వినవచ్చెను. క్రమేపీ శాంతుడై శేషించిన రాత్రి బాబావద్దనే గడపెను. ***(సశేషం)***

# రచయితలకు మనవి

బాబా సందేశాలతో సరళ వ్యావహారిక భాషలో చక్కని వ్యాసాలు ప్రచురణకై పంపవల్సింది!! అవి ఆంగ్ల అనువాదాలు అయితే ఒరిజినల్ ఆంగ్ల ప్రతి నకలు జతపరచవల్సింది.

ప్రచురణకు వీలు కాకపోతే స్టాంపులతికించిన కవర్లు పంపినా వాటిని తిరిగి వాపసు పంపలేమని గమనించవల్సింది.

ఉత్తర ప్రత్యుత్తరాలకు పత్రికకు తగినంత సిబ్బందిలేరని సహృదయంతో మమ్ముల్ని అర్థం చేసుకోగలరు. మీ రచనలు 'మెహెర్‌బాబా' పత్రికకు మాత్రమేనని దయచేసి లిఖిత పూర్వకంగా తెలుపవల్సింది. ఒకే వ్యాసాన్ని పలు పత్రికలకు పంపుట ద్వారా పాఠకుల సమయం వృధా చేయడమేనని మనవి.

రచనలు పంపుటకు చిరునామా. ఎడిటర్, మెహెర్‌బాబా, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్‌కాలనీ , సికింద్రాబాద్-500087 ఫోన్: 99595-53218 **-ఎడిటర్**

# డా॥ కూర్మాచలం

బాబా ప్రేమికులు డా॥ కూర్మాచలం రామకృష్ణ, హైదరాబాద్ ఏప్రిల్ 23న అవతారునిలో లీనమయ్యారు. నిరంతరం బాబా నామస్మరణలో, బాబా సేవలో నిమగ్నమయివుండే డా॥ కూర్మాచలం కరీంనగర్ జిల్లా జగిత్యాలలో 1939 జూన్ 6న జన్మించారు. 1968 నుండి పలు ప్రభుత్వ ఆసుపత్రులలో, హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో వివిధ హోదాలలో ఆయన పనిచేశారు. ఎందరో రోగులకు సేవాభావంతో ఎనలేని వైద్యసేవలు అందజేశారు. IMA, IADVL, IAS STD& AIDS వంటి పలు వైద్య సంస్థలలో అనేక ప్రతిష్ఠాత్మకమైన పదవులు సయితం అలంకరించారు.

నిరంతరం బాబా నామ జపంలో వుండే డా॥ కూర్మాచలం రామకృష్ణ సంస్మరణార్థం జూన్ 7న కోఠి సెంటర్ హైదరాబాద్‌లో ప్రత్యేక మెహెర్‌బాబా కార్యక్రమాన్ని వారి కుటుంబ సభ్యులు నిర్వహించారు.





# శ్రీకాకుళం

శ్రీకాకుళం సెంటర్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 25 నుండి జూన్ 5 వరకు తీవ్ర వేసవికాలంలో బాటసారులకు బాసటగా చలివేంద్రం నిర్వహించడమైనది. మంచినీళ్ళతో పాటు మజ్జిగా పంపిణి చేసాం. మే 24న స్థానిక వాణిజ్య పారిశ్రామిక ప్రదర్శనశాల కళా ప్రాంగణంలో అవతారుని భజన సంకీర్తనలు, నృత్యరూపకం ప్రదర్శించడమైనది. శ్రీ హరిమెహెర్ బాబా పాత్రధారిగా సభికులను ఎంతగానో ఆకర్షించారు. నృత్య రూపాకాన్ని శ్రీ వి. కామేశ్వరరావు పర్యవేక్షించారు.

# హమీర్‌పూర్

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హమీర్‌పూర్‌ను బాబా ప్రేమికులందరూ తప్పక సందర్శించాల్సిన పుణ్యక్షేత్రం. మూడునదులసంగమం హమీర్‌పూర్ పట్టణం. ఆ చుట్టు ప్రక్కల అనేక గ్రామాలు, బాబా పాదధూళితో పునీతమయ్యాయి.

ఇటీవలికాలంలో బాబానామం ఉత్తరప్రదేశ్ నలుమూలలా వ్యాపించింది. రాష్ట్ర రాజధాని లక్నోలో బాబా సెంటరు వెలిసింది.

ఫరూఖాబాద్ జిల్లా యాకుత్‌గంజ్‌లో గత రెండేళ్ళుగా బాబా 'మేళా' నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సంబరాలు జూన్ 10వ తేదీ నుంచి మూడు రోజులు జరుపుతున్నారు. బాబా కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే. కాన్పూరునుంచి డెహ్రాడూన్ వెళ్ళే దారిలో యాకుత్‌గంజ్ వస్తుంది. కాన్పూరుకు సుమారు 120 కి.మీ. దూరం. ప్రతి గంటకి బస్సులు, రైళ్ళు కాన్పూరునుంచి బయలు దేరతాయి.

దూరప్రాంతాలనుంచి వచ్చే బాబా ప్రేమికులకి భోజనవసతి సదుపాయాలని కల్పిస్తున్నారు. మీరు రైల్లో వస్తున్నారో, బస్సులో వస్తున్నారో ముందుగా తెలియజేస్తే తగిన ఏర్పాట్లు చేయగలమని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

మూడురోజుల మెహెర్ ఉమంగ్ మేళాలో పాటలు పాడదలచినవారు, సంగీత, నృత్యాలను ప్రదర్శించ దలచినవారు తమ వివరాలు ముందుగా శ్రీమతి ప్రియసక్సేనా, (011-25370034), అలాగే శ్రీమతి మెహెర్ రుచి సక్సేనాలకు (పుకార్‌జీ మనవరాలు. ఫోను నెం. 09799100160) తమ వివరాలను పంపవలసింది.

ఉత్తర ప్రత్యుత్తరాలకు - ప్రేమ్ బహదూర్ సక్సేనా, 1/259, బి, భూసామండి, ఫతేగఢ్ కోత్వాలి దగ్గర, ఫతేగఢ్- 209601, జిల్లా ఫరూఖాబాద్.

# జి.వి.జి.కె. చంద్రమౌళీశ్వరరావు

అవతార్ మెహెర్, సంపాదకులు, శ్రీజి.వి.జి.కె. చంద్రమౌళీశ్వరరావు 2008 మే 12న ఉదయం 7 గంటల సమయంలో బాబా నామస్మరణతో తీవ్ర గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. 1956లో ప్రారంభించిన అవతార్ మెహెర్ తెలుగు మాస పత్రికకు సంపాదకత్వ బాధ్యతను జూన్ 1987 నుండి శ్రీ జి.వి.జి.కె. చేపట్టారు. ఆనాడు పత్రికా నిర్వహణకై బ్యాంకు బ్యాలెన్సు కేవలం రు. 28 వేలు ఉండగా రాష్ట్రంలోని పలు బాబా సెంటర్లు సందర్శించి, అత్యధిక సంఖ్యలో పత్రికకు సభ్యులుగా చేర్పించడమే కాకుండా, పత్రిక ఆర్థిక పరిస్థితి మెరుగుపడేలా శ్రీ చంద్రమౌళీశ్వరరావు ఎనలేని కృషి చేశారు.

రాష్ట్రం నాలుగు చెరుగులా శ్రీకాకుళం నుంచి నెల్లూరు దాకా అన్ని అవతార్ మెహెర్‌బాబా సెంటర్లు సందర్శించి, అవతారుని విశిష్టతపై అనర్గళంగా ప్రసంగించి బాబా నామవ్యాప్తికి శ్రీ చంద్రమౌళీశ్వరరావు విశేషకృషి చేశారు.

1950వ దశకంలో వ్యవసాయ శాఖలో చేరి అదేశాఖలో ఉన్నతాధికారిగా రిటైరయ్యారు. వ్యవసాయశాఖలో పని చేసేరోజుల్లో తోటి ఉద్యోగస్థుల సంక్షేమం కోసం అనేక చర్యలు ఆయన తీసుకున్నారు.

కాంగ్రెస్ కార్యకర్తగా సేవాదళ్ వాలంటీర్‌గా 1947 నుంచి పనిచేసిన విశేష అనుభవం వీరికుంది. 1957 ఫిబ్రవరి 21న మెహెర్‌బాబా ద్వితీయ ఆంధ్రా పర్యటనకు విచ్చేసిన సందర్భంలో తొలిసారిగా అవతారుని దర్శనం శ్రీ చంద్రమౌళీశ్వరరావు చేసుకున్నారు.

అవతారుని స్పర్శ భాగ్యం సయితం ఆయన పొందారు.

ఐతే, ఇదంతా కేవలం యాదృచ్ఛికం. విజయవాడకు అవతార పురుషుడనని ప్రకటించుకుని ఒక మానవుడు వస్తున్నట్లు ఆయన కార్యక్రమాన్ని భగ్నం చేయ తలపెట్టిన కొందరు ఆగంతుల దుష్టచర్యలను అడ్డుకోవడానికి గాను స్థానిక కాలేజి కాంగ్రెస్





సేవాదళ వాలంటీర్‌గా ఆనాటి కార్యక్రమానికి ఆయన వెళ్ళడం జరిగింది. అలా అవతారుని దర్శనం- స్పర్శభాగ్యం పొందానని చంద్రమౌళీశ్వర రావు తన గురించి రాసుకున్న 'స్వగతం' చిరుపుస్తకంలో పేర్కొన్నారు.

1957లో బాబా దర్శనం చేసుకున్నా 1966 దాకా తిరిగి మెహెర్‌నామం వారి చెవులను తాకలేదు. 1966లో నూజివీడులో పనిచేసే రోజుల్లో కృష్ణాజిల్లా వ్యవసాయశాఖ ఉన్నతాధికారి శ్రీ అల్లా అప్పలనాయుడు ద్వారా మెహెర్‌బాబా నామం తిరిగి పరిచయ భాగ్యం కల్గిందని, ఆ దరిమలా మెహెర్‌బాబా నామవ్యాప్తికి విశేషకృషి చేశానని **స్వగతంలో** శ్రీ జి.వి.జి.కె రాసుకున్నారు.

నూజివీడులో మెహెర్‌బాబా సెంటర్ వీరు నెలకొల్పారు. అనంతరం చింతా సర్వారావు, మాజేటి రామోహనరావు, పెమ్మరాజు సుందర శివరావు, మాణిక్యాలరావు, తదితరులందరితో మెహెర్‌బాబా కార్యక్రమాలు అనేకం ఆయన నిర్వహించారు.

అవతార్ మెహెర్ పత్రిక నిర్వహణతో పూర్తికాలం మెహెర్‌బాబా సేవలో తరించిన చంద్రమౌళీశ్వరరావు గత కొద్దికాలంగా అస్వస్థతో వున్నారు. ఆరోగ్యం సహకరించకపోయినా, పత్రిక నిర్వహణలో ఎలాంటి ఉపేక్ష చూపని చంద్రమౌళీశ్వరరావు మే 12న ఉదయం 7 గంటల సమయంలో, మెహెర్‌బాబా ప్రేమికులందరూ బాబాను ప్రార్థించే సమయంలో ఆయన తుదిశ్వాస విడిచారు.

బాబా మండలి సభ్యులు సో॥ ఏరుచ్, జి.వి.జి.కె.ని క్లుప్తంగా **'మెహెర్‌చంద్ర'** అని పిలిచేవారు. మెహెరాజాద్‌లోని మండలి బాబా ప్రేమికులు చాలామందికి ఈయన 'మెహెర్‌చంద్ర' గానే సుపరిచితులు. మెహెర్‌బాబాకు సంబంధించిన ఇంగ్లీషులో వున్న పలు గ్రంథాలను తెలుగులో ఆయన అనువదించారు.

మెహెర్‌బాబా అవతార తత్వం గురించి అనర్గళంగా సుమారు 1116 సహవాస్ కార్యక్రమాలలో ఆయన ప్రధాన వక్తగా ప్రసంగించిన అరుదైన వ్యక్తి శ్రీ మెహెర్ చంద్ర. వీరి మరణం బాబా ప్రేమికులందరికీ గొప్ప తీరని లోటు.

# సంతాపం

మే, జూన్ నెలలలో ఆకస్మికంగా మరణించిన శ్రీ కె.కె.రామక్రిష్ణన్, తెన్నేటి భాస్కర్‌రావు, విజయవాడ, శ్రీ చంద్రమౌళీశ్వరరావు, శ్రీ తోట పద్మనాభరావుల ఆత్మశాంతి కలగాలని చోడవరం సెంటర్ ప్రేమికులు కొద్దిసేపు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారని స్థానిక సెంటర్ కార్యదర్శి వి.ఎస్.ఎన్.మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

# నిన్ను మరచి ఉండలేనయా!!

- సుశీలా కృష్ణ మల్లాది

నిన్ను మరచి ఉండలేనయా,
పింపలవాసా, నిన్ను మరచి ఉండలేనయా,
నిన్ను మరచి ఉండలేను, కన్నతండ్రి వగుటచేసి
ఎన్న బోకు చేసిన నేరములను,
షిరీను కుమార మెహెరుబాబా ॥నిన్ను॥

సర్వమునకు కర్తనీవే,
సర్వమునకు భోక్త నీవే,
సర్వమునకు ఆర్తినీవు,
పరమ పురుష మెహెరుబాబా... ॥నిన్ను॥

పూనావాస మెహెరుబాబా,
నీవె నీడ మాకు బాబా,
కావుమయ్య, శరణు, శరణు, దేవ.. దేవ..
మెహెరుబాబా..... ॥నిన్ను॥

# హెల్ప్‌లైన్

**పుస్తకం ఇంకా రాలేదా??**

మెహెర్‌బాబా పత్రిక పోస్టల్ బట్వాడాకు సంబంధించి మీరు ఎటువంటి ఫిర్యాదులనైనా అందించాలంటే హైదరాబాద్‌లోని ఈ క్రింది ఫోన్ నెంబర్‌లలో ఎవరినైనా కూడా సంప్రదించగలరు.

**శ్రీ యన్. మహేశ్వర్‌రావు -040- 27964050, 9441218841,**

**శ్రీ కె.యస్. ఓం ప్రకాశ్-94403-65640**





# శ్రద్ధాంజలి

- సామల రాజమల్లయ్య (సిరిసిల్ల)

సీ॥ ప్రియతమ మెహెరుని ప్రేమ పీయూషమున్
ప్రియమార గ్రోలిన ప్రేమికుండు
జీవితమంతయు శ్రీ మెహెర్‌బాబ సత్
సేవలో గడిపిన సేవకుండు
ఉన్నదొక్కడె మెహెరున్నతోన్నతుడని
దామను పట్టిన ధన్యతముడు
బాబ పుట్టిన 'పూన' పట్టణంబున 'మెహెర్
కేంద్రమున్' నిల్పిన సాంద్రగుణుడు
బాబ సాహిత్యమున్ ప్రచురణగావించి
ప్రసరింప జేసిన ప్రాజ్ఞవరుడు
'బైరమంగళ కేంద్ర' భవన సమూహంబు
పూర్తి గావించిన పుణ్యతముడు
మౌనావతారుని యానతి నెప్పుడు
శిరసావహించిన స్థిరగుణుండు
పూన మెహ్రాబాదు- ఆనంద యాత్రను'
ఏర్పాటు చేసిన ఇద్ధగుణుడు
అంత్యకాలము నందు అవతారుని స్మరించి
తుదిశ్వాస వీడిన సదమలుండు
పరబ్రహ్మ పరమాత్మ ప్రభు మెహెర్ బాబలో
ఐక్యమై యలరిన అమరుడితడు
ప్రీతి పాత్రుడు సోదర ప్రేమికుండు
బాబ యిచ్ఛకధీనుడై బ్రతికి నాడు
పూన సెంటరు సెకరెట్రియైన "కేకె
రామకృష్ణుడు" మెహెరుబా ప్రేమికుండు
అతని కర్పింతు శ్రద్ధాంజలాదరమున.

# జీవిత - వార్షిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు)
2. రెండు దఫాలుగా కూడా రూ.500/- చొప్పున చెల్లించవచ్చు.
3. ఏదేని కారణాలచేత మీరు చెల్లించిన జీవిత సభ్యత్వం వాపసు కోరిన ఎడల తక్షణమే వడ్డీ లేకుండా తిరిగి పంపగలమని హామీ.
4. వార్షిక సభ్యత్వం రూ.100/-
5. మీరు పంపే నగదు పోస్టలు మనీ ఆర్డర్ ద్వారా పంపితే ఉభయకుశలోపరి. మీకు పోస్టలు శాఖవారి రశీదు లభిస్తుంది.

బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు. మాకు అందిన జీవిత సభ్యుల వివరాలు ప్రతి నెలా పత్రికలో ప్రచురిస్తున్నామని గమనించగలరు.

## వెయ్యి రూపాయలు - జీవిత సభ్యత్వం
## 2008 మే-జూన్ నెలలో పంపిన వారి వివరాలు

| నెం. | తేది | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | 00.06.2008 | నల్లా వెంకట సుబ్బారావు, C/o బి. పేర్రాజు, విలాసవిల్లి, అమలాపురం | రు. 1000.00 |
| 2. | 00.06.2008 | శ్రీమతి పి. నర్సమ్మ, C/o బి. పేర్రాజు, హైదరాబాద్ | రు. 1000.00 |
| 3. | 00.06.2008 | అవతార్ మెహెర్‌బాబా, ఉయ్యూరు సెంటర్, కృష్ణా జిల్లా, C/o నాదేండ్ల కృష్ణారావు | రు. 1000.00 |
| 4. | 00.06.2008 | ఎం.వి.కె. ప్రసాద్, హైదరాబాద్ | రు. 1000.00 |
| 5. | 00.06.2008 | ఎన్. లింగం, దార్‌పల్లి, నిజామాబాద్ | రు. 60.00 |
| 6 | 00.06.2008 | మెట్ల కోట వెంకట సుబ్బారావు, చల్లపల్లి | రు. 500.00 |
| 7. | 00.06.2008 | పి.మెహెర్ ఆనంద్, సిరిసిల్ల, | రు. 1000.00 |
| 8. | 00.06.2008 | బి. భాస్కరరావు, బెంగళూరు. | రు. 1000.00 |
| | | **మొత్తం** | **రు. 6560.00** |





# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు,
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేనివాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతట గలవు,
నీవు అన్నింట నున్నావు
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమున గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడులోకములలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయలను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాప్తివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య,
జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోన్నతుడవు,
నీవు పరుడవు,
పరమేశ్వరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
పరమాత్మవు, అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.